TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 83 | హైదరాబాద్ | శుక్రవారం 11-09-2026 | పేజీలు: 08

## గ్రామాల సొంత ఆదాయం..
# గ్రామాల అవసరాలకే

73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తితో నిర్ణయం
ట్రెజరీ నిబంధనలతో నిధుల జాప్యం
జీపీల బ్యాంకు ఖాతాల్లోకే సొంత ఆదాయం
గ్రామాల అభివృద్ధికి
నిధుల వినియోగం సులువు




2

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి..

## ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
అసెంబ్లీ కార్యకలాపాలను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ
అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ అహంకారం వీడలేదని వ్యాఖ్య
ప్రతిపక్షాల కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యేలకు పిలుపు
ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు.
ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు.
బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మిగతా 2లో..





### బయట బీఆర్ఎస్.. సభలో
## బీజేపీ గందరగోళం

సభా సమయం వృథా చేస్తున్నారని విమర్శ
మూడు రోజులు వృథా అయ్యాయని వ్యాఖ్య
ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని స్పష్టీకరణ
బీఆర్ఎస్ తీరుపై ఆది శ్రీనివాస్ ఆగ్రహం
22ఏపై భాజపా ఆందోళన చేస్తోందని ఆరోపణ
సభలో అలజడి సృష్టిస్తున్నారని విమర్శ
స్పీకర్ అవమానంపై బీఆర్ఎస్ చర్చకు రావడం లేదని వ్యాఖ్య
రాజకీయాలు కాకుండా ప్రజా సమస్యలపై చర్చించాలని సూచన
అన్ని సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి
సభ సజావుగా సాగేందుకు సహకరించాలని విజ్ఞప్తి

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్, భాజపా వ్యవహరిస్తున్న తీరుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు. బయట బీఆర్ఎస్.. సభలోపల భాజపా గందరగోళం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. రెండు పార్టీలు కలిసి సభా కార్యక్రమాలకు అడ్డంకులు మిగతా 2లో..

# ప్రశ్నిస్తామనే సస్పెండ్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
సభ్యుల సస్పెన్షన్‌పై కేటీఆర్ ఆగ్రహం
కాంగ్రెస్ పాలనలో రేవంత్ కుటుంబానికే లబ్ధి
రూ.200 కోట్ల భూమి కేటాయింపుపై ప్రశ్న
సీఎం సోదరుడి కంపెనీకి భూమి ఎలా ఇచ్చారని నిలదీత
అనుముల అన్నదమ్ముల దోపిడీపై భాజపా మౌనమెందుకని ప్రశ్న
ఫ్యూచర్ సిటీపై పోరాటం చేస్తామని ప్రకటన
రంగారెడ్డి జిల్లాలో సదస్సులు నిర్వహిస్తామని వెల్లడి
న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టీకరణ
ఈడీ విచారణకు ఆదేశించాలని డిమాండ్
సస్పెన్షన్ ఎత్తితే అసెంబ్లీకి వస్తామని ప్రకటన

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఒక్క రేవంత్‌రెడ్డి కుటుంబం మాత్రమే బాగుపడిందని విమర్శించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను సభ నుంచి బయటకు పంపడం ద్వారా ప్రభుత్వంపై ప్రశ్నలు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న భూకేటాయింపులు, ఇతర నిర్ణయాలపై అసెంబ్లీలో ప్రశ్నించేందుకు ప్రయత్నించామని కేటీఆర్ తెలిపారు. సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని సీఎం సోదరుడికి చెందిన కంపెనీకి ఎలా కేటాయించారనే అంశాన్ని సభలో లేవనెత్తాలని భావించామని చెప్పారు. ఈ వ్యవహారానికి సంబంధించిన విషయాలన్నీ మిగతా 2లో..



# పేదల ఆత్మగౌరవమే లక్ష్యం..

పేదలను దూర ప్రాంతాలకు తరలించే విధానం లేదు
ఖరీదైన ప్రాంతాల్లోనూ పేదలకు ఇళ్ల నిర్మాణం
ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్ల మంజూరు
ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పూర్తి పారదర్శకత
డ్రా అనంతరం లబ్ధిదారుల ఇళ్ల వద్దే భౌతిక పరిశీలన
ఉపాధికి దూరం కాకుండా ఇళ్ల కల్పన

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా మిగతా 2లో..



# డిజిటల్ వేదికలపై ఆంక్షలు ఉండాలి

చిన్నారులకు రక్షణ అవసరం
సోషల్ మీడియా వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
డిజిటల్ వేదికలపై హద్దులు ఉండాలి
ఆన్‌లైన్ వేధింపులపై ఆందోళన
మైనర్ల భద్రతపై దృష్టి
కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు
రక్షణ చర్యలపై వివరణ కోరిన ధర్మాసనం
సోషల్ మీడియా వినియోగంపై పిటిషన్
పిల్లలపై ఆన్‌లైన్ ప్రమాదాల ప్రస్తావన
నిబంధనల అవసరాన్ని గుర్తించిన కోర్టు
తదుపరి విచారణకు కేసు



2

## ‘తమ్ముడూ విజయ్..’ జైల్లో
# నా దవడ విరిగింది నిజమే!

తమిళనాడు సీఎం విజయ్‌కు మాజీ సీఎం స్టాలిన్ కౌంటర్
దవడ గాయం నాటి ఘటన గుర్తుచేసుకున్న స్టాలిన్
ఎమర్జెన్సీ రోజుల్లో జైలు జీవితం అనుభవించానని వెల్లడి
చిత్రహింసలకు గురయ్యానని ఆవేదన.. పోలీసులు కొట్టారని ఆరోపణ
పోరాటం తమకు కొత్త కాదని వ్యాఖ్య.. డీఎంకే చరిత్రలో తానూ భాగమేనని స్పష్టం

**ప్రజాక్షేత్రం, నేషనల్‌బ్యూరో**

తమిళనాడు అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను అనుకరిస్తూ సీఎం విజయ్ చేసిన సంజ్ఞపై డీఎంకే నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. స్టాలిన్ దీటుగా స్పందించారు. ‘తమ్ముడూ విజయ్..’ అంటూ ఎక్స్ వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ సమయంలో తాను ఎదుర్కొన్న జైలు జీవితాన్ని, చిత్రహింసలను గుర్తుచేసుకున్నారు.

**‘జైల్లో చిత్రహింసలు అనుభవించాం’**

197577 మధ్య ఎమర్జెన్సీ సమయంలో కరుణానిధి నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం రద్దయిన విషయాన్ని స్టాలిన్ ప్రస్తావించారు. అప్పట్లో డీఎంకే యువజన విభాగానికి నాయకత్వం మిగతా 2లో..



## ఉద్యోగులు, పెన్షనర్లకు
# మెరుగైన వైద్యం

మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి
ఈహెచ్ఎస్‌లో 17 లక్షల మందికి పైగా లబ్ధిదారులు
అర్హులందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు
ఓటీపీతో కార్డు డౌన్‌లోడ్ సదుపాయం
ఈహెచ్ఎస్‌కు రూ.1,056 కోట్ల బడ్జెట్
నెలకు రూ.88 కోట్ల నిధులు సమకూరుతున్నాయని వెల్లడి
921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ సేవలు
114 ప్రభుత్వ ఆసుపత్రులు, 807 ప్రైవేట్ ఆసుపత్రులు
రాష్ట్రవ్యాప్తంగా 37 వెల్‌నెస్ కేంద్రాలు
ఇప్పటివరకు 12 జిల్లాల్లో వెల్‌నెస్ కేంద్రాలు
8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీఆథరైజేషన్



**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జులై 17 నుంచి నూతన ఈహెచ్ఎస్ సదుపాయాన్ని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈహెచ్ఎస్ పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని మంత్రి తెలిపారు. ఓటీపీ ఆధారంగా హెల్త్ కార్డును డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ విధానంలో కార్డులు అందుబాటులోకి రావడం వల్ల లబ్ధిదారులకు ఆరోగ్య సేవలు పొందడంలో మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈహెచ్ఎస్ పథకం కోసం ఏడాదికి రూ.1,056 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు మిగతా 2లో..



# చిన్నారెడ్డి ఏం చేయబోతున్నాడు..?

వేటు పడగానే సొంత వ్యవసాయక్షేత్రానికి చిన్నారెడ్డి
ప్రభుత్వ, పార్టీ పెద్దల మీద నో కామెంట్స్
ప్రభుత్వ పదవి నుంచి తప్పించినా అలాగే ఉన్న పార్టీ పోస్ట్
కాంగ్రెస్‌ను వదలబోరంటున్న చిన్నారెడ్డి సన్నిహితులు

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

మాజీ మంత్రి చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటారా? లేక రాజీనామా చేసి వేరేదారి చూసుకుంటారా? పోస్ట్ ఊస్టింగ్ తర్వాత సైలెంట్‌గా తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిపోయిన పార్టీ ఇయర్స్ హస్తం వీరవిధేయుడు అక్కడ ఏం చేస్తున్నారు? ఆయన సైలెంట్ మోడ్ వెనకున్న స్కెచ్ ఏంటి? కొడుకు భవిష్యత్‌కు హామీ దొరికితే పక్క చూపు చూస్తారన్న ప్రచారంలో నిజమెంత? అసలు చిన్నారెడ్డి గురించి వనపర్తి విశ్లేషణలేంటి? వనపర్తి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంది. నియోజకవర్గం గోపాల్‌పేటలో మిగతా 2లో..

# పేదల ఆత్మగౌరవమే లక్ష్యం..

**మొదటిపేజీ తరువాయి**

30-40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150-200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు.

ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించలేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి.. తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో శుభవార్త అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారి భౌతిక పరిశీలన పూర్తిచేసి తుది జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌లో గృహప్రవేశాలు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్లలోనూ ఇదే విధానాన్ని పైలట్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, అవసరమైతే మున్సిపాలిటీల్లోనూ పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో నిబంధనలను సడలించాలని సభ్యులు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, మేడిపల్లి సత్యం, మనోహర్ రెడ్డి కోరారు. స్లాబ్ ఏరియాను 750ఎస్‌ఎఫ్టీ నుంచి 1000ఎస్‌ఎఫ్టీకి పెంచాలని మేడిపల్లి సత్యం సూచించారు. జీవనోపాధి కోసం తీసుకున్న ఆటోలు, ట్రాక్టర్లతో పేరుతో ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడంలేదని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లు ఎగ్గొట్టిన రుణాలను మాఫీ చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్లకు మాత్రం నిధులివ్వడంలేదని మనోహర్ రెడ్డి విమర్శించారు. పేదవాళ్లకే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని, నిబంధనలు సరిగ్గానే ఉన్నాయని సభ్యులు వెంకట్రామిరెడ్డి అన్నారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతుంటే కాంగ్రెస్ సభ్యులు కామెంట్స్ చేశారు. దీంతో స్పందించిన వెంకట్రామిరెడ్డి' నేను ఇందిరమ్మ పథకం గురించి మాట్లాడుతున్న.. మీరు రాజకీయం చేయొద్దు.. రాజకీయం చేద్దామంటే..చేద్దాం. మీరు నాకు నీతులు చెప్పొద్దు. నా నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీ పేరుతో 350ఇండ్లను ఆమోదించలేదు. ఆర్డీఓ కూడా స్పందిస్తలేరు. రోజు వెళ్లి నమస్తే పెట్టమంటే పెడతా' అని ఘాటుగా స్పందించారు.


# చిన్నారెడ్డి ఏం చేయబోతున్నాడు..?

**మొదటిపేజీ తరువాయి**

ఓ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారెడ్డి... సొంత పార్టీకే చెందిన స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిని గట్టిగా టార్గెట్ చేశారు. అదే ఊపులో కాంగ్రెస్ అధిష్ఠానం డబ్బులకు టిక్కెట్లు ఇచ్చిందని, అవసరమైతే పార్టీలోనే ఉంటూ జీవన్‌రెడ్డిలా తిరగబడతానంటూ హాట్ ఘాటు కామెంట్స్ చేశారు. ఈ ఎపిసోడ్‌ను ఎమ్మెల్యే మేఘారెడ్డి సీరియస్‌గా తీసుకుని...గాంధీభవన్ మీదుగా ఏఐసీసీ దాకా వెళ్ళారు. ఇక కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం కూడా వేగంగా స్పందించి చర్యలకు సిఫారసు చేయడంతో వేటు పడింది. ఇక పదవి నుంచి తప్పించారన్న ప్రకటన రాగానే తన వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యక్షమయ్యారు చిన్నారెడ్డి. కానీ... అటు పార్టీ పెద్దలపై కాని, ఇటు ప్రభుత్వ పెద్దల మీదగానీ...ఎక్కడ బహిరంగ వ్యాఖ్యలు చేయలేదాయన. కానీ... తన అనుచరుల దగ్గర మాత్రం... నాకు పదవి మీద షోకు లేదని, అది ఉన్నా, లేకున్నా చిన్నారెడ్డికి గౌరవం ఉందని, ఆ గౌరవంతోనే నమ్ముకున్న వారికి పనులు అవుతాయని అన్నారట. నాకు ప్లానింగ్ కమిషన్ పదవిని టిల్ ఫరదర్ ఆర్డర్స్ అంటూ ఇచ్చిన సంగతి గుర్తు చేసినట్టు మాట్లాడుకుంటున్నారు. పదవి ఉన్నప్పుడే ప్రోటోకాల్ సదుపాయాన్ని వదులుకున్నానంటూ చెప్పుకొచ్చినట్టు తెలిసింది. ఆ ఎపిసోడ్ తర్వాత ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం కూడా చేయలేదని అన్నారాయన. ఆ సంగతి ఎలా ఉన్నా...ఒక పాయింట్ మీద రాజకీయ వర్గాలతో పాటు కాంగ్రెస్ శ్రేణుల్లో కూడా డౌట్ కొడుతోందట. చిన్నారెడ్డిని ప్రభుత్వ పదవి నుంచి తప్పించినా... పార్టీ పరంగా ఏఐసీసీ సెక్రెటరీ పోస్ట్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ పరిస్థితిలో ఆయన కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతారా? లేక టాటా..బైబై అంటారా అన్న చర్చలు జోరుగా జరుగుతున్నాయి.

అయితే... ఆయన పార్టీకి విధేయుడు, 48 ఏళ్ళుగా కాంగ్రెస్ లైన్ దాటని గాంధీ కుటుంబ సన్నిహితుడని, అలాంటి నాయకుడు మారే ప్రసక్తే లేదంటున్నారు సన్నిహితులు. వనపర్తిలో పార్టీని నిలబెట్టిందే ఆయన అంటూ... పక్క చూపులు ఉండబోవని చెబుతోంది మాజీ మంత్రి శిబిరం. కానీ... బయటి లెక్కలు మాత్రం వేరుగా వినిపిస్తున్నాయి. మారిన పొలిటికల్ ఇక్వేషన్స్‌తో ఏదైనా సాధ్యమేనని అంటున్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి బలోపేతం కావడం, కాంగ్రెస్‌లో జరిగిన అవమానాల కారణంగా చిన్నారెడ్డి మారిపోవడం ఖాయమనే అభిప్రాయం వనపర్తి పొలిటికల్ సర్కిల్స్‌లో ఉంది. తన కుమారుడి రాజకీయ భవిష్యత్‌కు హామీ ఇస్తే... ఆయన బీఆర్ఎస్‌లో చేరతారని, ఆ ఉద్దేశ్యంతోనే... మరో జీవన్ రెడ్డి అవుతానంటూ కామెంట్ చేసి ఉండవచ్చని కొందరు విశ్లేశిస్తున్నారు.

దీనికి తోడు చిన్నారెడ్డి సోషల్ మీడియా పేజీల్లో పెట్టే వివిధ పోస్టులు కూడా ఏ పార్టీకి సంబంధం లేకుండా తన ఒక్కడి ఫోటోతో ఉన్నవే పెడుతున్నారు. ఇక ఇదే సమయంలో...సీఎం రేవంత్ రెడ్డితో సాన్నిహిత్యం ఉన్న చిన్నారెడ్డికి ఎక్కడ పొరపొచ్చాలు వచ్చాయి? అసలు గ్యాప్‌నకు కారణమేంటంటూ వెతికే పనిలో సీరియస్‌గా ఉన్నారు కొందరు. చిన్నారెడ్డి తనకు రాజ్యసభ సీటు అడిగి భంగపడ్డారని కొందరు, ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి కట్టబెట్టాలనే ప్రతిపాదనను సియం రేవంత్ రెడ్డి తోసిపుచ్చినందుకేనని మరి కొందరు రకరకాలుగా విశ్లేషిస్తున్నారు. ఆ ఫ్రస్ట్రేషన్‌లోనే ఘాటు వ్యాఖ్యలు చేసి వేటుకు గురయ్యారంటూ స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఆయన పార్టీ వీడకపోవచ్చని సన్నిహితులు చెబుతుండగా... మారే వాతావరణమే కనిపిస్తోందన్నది పొలిటికల్ అనాలసిస్. దీంతో.... భవిష్యత్ కార్యాచరణపై ఉత్కంఠ పెరుగుతోంది.



# ప్రశ్నిస్తామనే సస్పెండ్

**మొదటిపేజీ తరువాయి**

బయటకు వస్తాయనే భయంతోనే బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారని ఆరోపించారు.

అనుముల అన్నదమ్ముల దోపిడీపై భాజపా ఎందుకు మాట్లాడటం లేదని* కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూకేటాయింపులు, ప్రభుత్వ నిర్ణయాలపై భాజపా తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా డిఫెన్స్, ఏరోస్పేస్ కంపెనీ ఏర్పాటు చేశారని కేటీఆర్ ఆరోపించారు. ''దోచుకున్నది అంతరిక్షంలో దాచుకునేందుకు చేస్తున్నారు'' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి కేటీఆర్ ఎలాంటి ఆధారాలను వెల్లడించలేదు.

*ఫ్యూచర్ సిటీ విషయంలో పారిశ్రామికవేత్తలు బలిపశువులు కావొద్దని* కేటీఆర్ హెచ్చరించారు. ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు ఉండదంటూ ప్రభుత్వ ప్రణాళికలపై విమర్శలు చేశారు. ఈ అంశంపై రంగారెడ్డి జిల్లాలోని గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

ఫ్యూచర్ సిటీ భూకేటాయింపులు, పెట్టుబడుల విషయంలో బీఆర్ఎస్ అన్ని మార్గాల్లో పోరాటం చేస్తుందని కేటీఆర్ తెలిపారు. అవసరమైతే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే ఈ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న విధానాలను సమీక్షిస్తామని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భూములను పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తామని చెప్పారు. పెట్టుబడులు పెట్టే వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

*సస్పెన్షన్ ఎత్తివేస్తే నేరుగా అసెంబ్లీకి వెళ్లి చర్చలో పాల్గొంటామని* కేటీఆర్ ప్రకటించారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలపై సభలోనే ప్రశ్నలు సంధిస్తామని తెలిపారు. ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం ద్వారా ప్రజా సమస్యలపై చర్చను అడ్డుకోవడం సరికాదని విమర్శించారు.

అసెంబ్లీలో సీఎం టీమ్‌కు సంబంధించిన ఫేక్ ఖాతాను ప్రస్తావించి సభను తప్పుదోవ పట్టించారని కేటీఆర్ ఆరోపించారు. ఆ ఫేక్ ఖాతాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు కూడా ఇస్తామని కేటీఆర్ వెల్లడించారు.

బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్, ఫ్యూచర్ సిటీ భూకేటాయింపులు, సీఎం కుటుంబంపై కేటీఆర్ చేసిన ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి పెంచాయి. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు న్యాయపోరాటం కూడా చేస్తామని కేటీఆర్ ప్రకటించడంతో ఈ అంశాలు రానున్న రోజుల్లో మరింత రాజకీయ వివాదానికి దారితీసే అవకాశం ఉంది.



# ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్యం

**మొదటిపేజీ తరువాయి**

దామోదర్ రాజనర్సింహ తెలిపారు. నెలకు రూ.88 కోట్ల నిధులు సమకూరుతున్నాయని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ వంతుగా 1.5 శాతం చొప్పున చెల్లిస్తుండగా.. ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని చెల్లిస్తోందని చెప్పారు.

లబ్ధిదారులకు విస్తృతంగా వైద్య సేవలు అందించేందుకు 921 ఆసుపత్రులను ఈహెచ్‌ఎస్ పరిధిలోకి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. వీటిలో 114 ప్రభుత్వ ఆసుపత్రులు, 807 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని తెలిపారు. ఈ ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 37 వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరో 25 వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. ఈ కేంద్రాల ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు.

ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల మేర ప్రీఆథరైజేషన్ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్య చికిత్స పొందుతున్న ఉద్యోగులు, పెన్షనర్లకు అవసరమైన సేవలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి..

**మొదటిపేజీ తరువాయి**



మహిళా అధికారుల ముందే టీషర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు.

ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

# డిజిటల్ వేదికలపై ఆంక్షలు ఉండాలి

- **చిన్నారులకు రక్షణ అవసరం**
- **సోషల్ మీడియా వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**
- **డిజిటల్ వేదికలపై హద్దులు ఉండాలి**
- **ఆన్‌లైన్ వేధింపులపై ఆందోళన**
- **మైనర్ల భద్రతపై దృష్టి**
- **కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు**

**ప్రజాక్షేత్రం, నేషనల్‌బ్యూరో**

చిన్నారులు సోషల్ మీడియా, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే విషయంలో తగిన రక్షణ చర్యలు అవసరమని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలు డిజిటల్ వేదికలను సులభంగా వినియోగించే అవకాశం ఉన్నందున.. వారి భద్రత కోసం తగిన హద్దులు, రక్షణ వ్యవస్థలు ఉండాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది. మైనర్లు సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ వేదికలను వినియోగించడంపై రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ముఖ్యంగా పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు, హానికరమైన కంటెంట్, ఇతర డిజిటల్ ప్రమాదాలకు గురయ్యే అవకాశాలపై పిటిషన్‌లో ఆందోళన వ్యక్తమైంది.

**కేంద్రానికి నోటీసులు**

చిన్నారులను ఆన్‌లైన్ వేధింపులు, ఇతర ప్రమాదాల నుంచి రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఈ అంశంపై కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఐటీ చట్టం, 2021 ఐటీ నిబంధనలు, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం తదితర చట్టపరమైన వ్యవస్థలు అమల్లో ఉన్నాయని పేర్కొంది. ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, హానికరమైన కంటెంట్, డిజిటల్ వ్యసనం వంటి అంశాలపై రక్షణ అవసరాన్ని ప్రభుత్వం కూడా గుర్తించింది.

పిల్లల సోషల్ మీడియా వినియోగంపై వయో పరిమితులు, కంటెంట్ నియంత్రణ, ప్రైవసీ రక్షణ, యూజర్ వెరిఫికేషన్ వంటి అంశాలపై ఇటీవల పలు న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# బయట బీఆర్ఎస్.. సభలో బీజేపీ గందరగోళం

**మొదటిపేజీ తరువాయి**

కల్పిస్తున్నాయని విమర్శించారు.

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆది శ్రీనివాస్.. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారాలు కనుగొనాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సమావేశాలను నిర్వహిస్తోందన్నారు. అయితే ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ అంశాలను ముందుకు తెస్తున్నాయని విమర్శించారు.ఇప్పటికే మూడు రోజుల సభా సమయం వృథా అయిందని ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో రాజకీయ రగడకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. సభా సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించాల్సిన బాధ్యత అన్ని పార్టీల సభ్యులపైనా ఉందని పేర్కొన్నారు.

స్పీకర్‌పై జరిగిన అవమానంపై చర్చ జరపాలని కోరుతున్నా బీఆర్ఎస్ ముందుకు రావడం లేదని ఆయన ఆరోపించారు. స్పీకర్ పదవికి, శాసనసభ వ్యవస్థకు గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై బీఆర్ఎస్ వైఖరిని ఆయన తప్పుపట్టారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల అంశం ఇటీవల అసెంబ్లీలో కూడా చర్చకు వచ్చింది.

మరోవైపు 22ఏ అంశంపై చర్చ జరపాలంటూ భాజపా సభలో గందరగోళం సృష్టిస్తోందని ఆది శ్రీనివాస్ విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారపక్షం స్పష్టం చేసినప్పటికీ.. భాజపా సభ్యులు ఆందోళనకు దిగుతున్నారని ఆరోపించారు.

22ఏ భూముల అంశంపై భాజపా సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేయడంతో సభా కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని భాజపా డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం మాత్రం బీఏసీలో నిర్ణయించిన ప్రకారం సభలో చర్చ చేపట్టేందుకు సిద్ధంగా ఉందని చెబుతోంది.

ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కూడా నిర్మాణాత్మకంగా వ్యవహరించి ప్రజలకు సంబంధించిన సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటిపై సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

రాజకీయ ఆరోపణలు, ఆందోళనలతో సభా సమయాన్ని వృథా చేయకుండా ప్రజల సమస్యలపై చర్చకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆది శ్రీనివాస్ కోరారు. అసెంబ్లీ సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రామాల సొంత ఆదాయం.. గ్రామాల అవసరాలకే

- **73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తితో నిర్ణయం**
- **ట్రెజరీ నిబంధనలతో నిధుల జాప్యం**
- **జీపీల బ్యాంకు ఖాతాల్లోకే సొంత ఆదాయం**
- **గ్రామాల అభివృద్ధికి నిధుల వినియోగం సులువు**

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్**

తెలంగాణలో గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం , సత్వర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70, సబ్ సెక్షన్ 3కు ప్రతిపాదించిన కీలక సవరణ బిల్లును పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. గ్రామాలకు వచ్చే సొంత ఆదాయం నేరుగా గ్రామాల అవసరాలకే వేగంగా ఉపయోగపడాలనే సంకల్పంతో ఈ చట్ట సవరణను తీసుకువచ్చినట్లు ఆమె స్పష్టం చేశారు. నిధుల వినియోగంలో పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనం పెంచడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని స్పష్టం చేశారు.

**స్వయం పాలనకు 73వ రాజ్యాంగ సవరణే స్ఫూర్తి**

దేశంలో గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేయడం కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణను తీసుకువచ్చిందని మంత్రి సీతక్క గుర్తుచేశారు. గ్రామ పంచాయతీలు కేవలం ప్రభుత్వ పథకాలను అమలు చేసే ఏజెన్సీలుగా మిగిలిపోకూడదని, ప్రజలకు అత్యంత చేరువగా ఉండే స్వయం పాలనా సంస్థలుగా ఎదగాలన్నదే ఆ సవరణ ముఖ్య ఉద్దేశమని వివరించారు. స్థానిక సంస్థలకు తగిన అధికారాలు, బాధ్యతలతో పాటు ఆర్థిక వనరులను కల్పించినప్పుడే పరిపాలన మెరుగవుతుందని, అందుకే పంచాయతీలకు పన్నులు, సుంకాలు వసూలు చేసుకునే హక్కులు లభించాయని ఆమె పేర్కొన్నారు.

**ట్రెజరీ నిబంధనలతో ఇన్నాళ్లూ నిధుల జాప్యం**

గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణ, పారిశుధ్యం, వీధి దీపాలు, సీసీ రోడ్ల నిర్మాణం , సురక్షిత తాగునీటి సరఫరా వంటి నిత్యవసర పౌర సేవల బాధ్యత పంచాయతీలదేనని మంత్రి వివరించారు. అయితే ఇన్నాళ్లూ గ్రామ పంచాయతీలు వసూలు చేసుకునే సొంత ఆదాయ నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వచ్చేది. అత్యవసర పనులకు ఆ డబ్బును ఉపయోగిద్దామంటే ట్రెజరీ అనుమతులు, సుదీర్ఘమైన పత్రాల ప్రక్రియ వల్ల తీవ్ర ఆలస్యం జరిగేదని, ఫలితంగా పంచాయతీల వద్ద నిధులున్నా ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడేవారని ఆమె గుర్తుచేశారు.

**ఇకపై నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే సొంత నిధులు**

గ్రామంలో డ్రైనేజీ లీకేజీ, తాగునీటి పైప్‌లైన్ల రిపేర్లు, పారిశుధ్య అత్యవసర పనులు వచ్చినప్పుడు పంచాయతీకి తక్షణమే నిధులు అందుబాటులో ఉండాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని మంత్రి సీతక్క చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ల గ్రాంట్లు నేరుగా పంచాయతీ బ్యాంకు ఖాతాల్లోకే ఎలా అవుతున్నాయో, అదే విధంగా ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయం కూడా నేరుగా జీపీల బ్యాంకు ఖాతాల్లోనే జమ అయ్యేలా ఈ చట్ట సవరణ తోడ్పడుతుందని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక సవరణ ద్వారా తెలంగాణలో గ్రామ పంచాయతీలకు పూర్తిస్థాయి ఆర్థిక స్వేచ్ఛ లభించి స్థానిక స్వపరిపాలన మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# 'తమ్ముడూ విజయ్..' జైల్లో నా దవడ విరిగింది నిజమే!

**మొదటిపేజీ తరువాయి**

వహించిన తాను అరెస్టయ్యానని తెలిపారు. జైలులో చిత్రహింసలు అనుభవించామని చెప్పారు. కుష్టువ్యాధిగ్రస్తులతో కలిసి తమను ఉంచారని, తాము ఉన్న గదిలో ఒక్క బాత్రూమ్ మాత్రమే ఉండేదని వివరించారు. చుట్టూ దుర్వాసన ఉన్నప్పటికీ అక్కడే నిద్రించాల్సి వచ్చేదని పేర్కొన్నారు. పోలీసులు రాత్రిపూట నిద్రపోనివ్వకుండా లాఠీలు, బూట్లతో కొట్టేవారని ఆరోపించారు. తమను కొట్టేందుకు జీవిత ఖైదీలను నియమించారని చెప్పారు. తనతో పాటు జైలులో ఉన్న ఓ వ్యక్తి అక్కడే మృతి చెందాడని గుర్తుచేసుకున్నారు.

**'నా దవడ ఎముకలు విరిగాయి'**

ఆ దాడిలో తన దవడ ఎముకలు విరిగిపోయాయని స్టాలిన్ తెలిపారు. తనకు తగిలిన దెబ్బల గుర్తులు ఇప్పటికీ ఉన్నాయని చెప్పారు. ప్రజా జీవితంలో ఉన్న చాలామందికి, ముఖ్యంగా తమిళులు, తమిళనాడు కోసం పోరాడిన వారికి ఇలాంటి అణచివేత ఎదురైందన్నారు. తాము ఆ అనుభవాల నుంచి బయటపడ్డామని, పోరాడటం, అందుకు ఎదురయ్యే పర్యవసానాలను ఎదుర్కోవడం తమకు కొత్త కాదని వ్యాఖ్యానించారు.

**'అది డీఎంకే చరిత్ర'**

తాను స్ఫూర్తిగా భావించే అన్నాదురై కాలం నాటి చరిత్ర ఇదేనని స్టాలిన్ అన్నారు. అదే డీఎంకే చరిత్ర అని పేర్కొన్నారు. అందులో తాను భాగమైనందుకు గర్వంగా ఉందన్నారు. తన పోరాటం, తన జీవితం గురించి తెలుసుకోవాలని విజయ్‌కు సూచించారు. తన గురించి విజయ్‌కు నిజాలు తెలియవని వ్యాఖ్యానించారు.

**విజయ్ సంజ్ఞపై వివాదం**

సెప్టెంబర్ 7న అసెంబ్లీలో విజయ్ డీఎంకే ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ సమయంలో తన దవడను పైకెత్తుతున్నట్లుగా విజయ్ ఓ సంజ్ఞ చేశారు. అది స్టాలిన్‌ను ఉద్దేశించినదేనంటూ డీఎంకే నేతలు తీవ్రంగా విమర్శించారు. దీనిపై విజయ్ వివరణ ఇస్తూ.. ఆ సంజ్ఞ అనుకోకుండా జరిగిందని, ఉద్దేశపూర్వకంగా చేయలేదని పేర్కొన్నారు.





# మద్యానికి దూరంగా.. కుటుంబానికి చేరువగా!

- **మద్యానికి దూరంగా.. కుటుంబానికి చేరువగా!**
- **కానిస్టేబుళ్లకు ఎస్పీ సునితారెడ్డి ఆత్మీయ కౌన్సెలింగ్**
- **ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలూ నిర్వర్తించాలి**

**వనపర్తి, సెప్టెంబరు 10 (ప్రజా క్షేత్రం ):**

మద్యపాన వ్యసనానికి బానిసై కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లకు చికిత్స అనంతరం జిల్లా ఎస్పీ సునితారెడ్డి ఆత్మీయంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. తప్పును గుర్తించి జీవితాన్ని మార్చుకోవాలని, కుటుంబానికి అండగా నిలుస్తూ విధుల్లోనూ క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

వనపర్తి జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న కిరణ్, నరసింహ మద్యపానానికి బానిసైన విషయం వారి భార్యలు, కుటుంబ సభ్యుల ద్వారా పోలీసు శాఖ దృష్టికి వచ్చింది. దీంతో మానవతా దృక్పథంతో స్పందించిన పోలీసు శాఖ వారిని హైదరాబాద్‌లోని మద్య విముక్తి చికిత్స కేంద్రానికి పంపించింది. అక్కడ నెల రోజులపాటు చికిత్స అందించారు. చికిత్స పూర్తయిన అనంతరం గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సునితారెడ్డి వారిని ప్రత్యేకంగా పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

**"మార్పు మన నుంచే ప్రారంభం కావాలి"**

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "మద్యపానం ఒక వ్యక్తి జీవితాన్నే కాదు.. మొత్తం కుటుంబాన్ని ప్రభావితం చేస్తుంది. సమస్యను కేవలం శిక్షతో చూడకుండా అవసరమైన సమయంలో చికిత్స, కౌన్సెలింగ్, ఆత్మీయతతో అండగా నిలిచి మంచి మార్పు తీసుకురావడమే పోలీసు శాఖ లక్ష్యం" అని అన్నారు.

"చికిత్స ద్వారా వచ్చిన మార్పును జీవితాంతం కొనసాగించాలి. ఇకపై మద్యపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి. భార్యా పిల్లలకు ప్రేమ, భరోసా కల్పిస్తూ కుటుంబంతో సంతోషంగా గడపాలి. తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా, మర్యాదగా వ్యవహరిస్తూ విధుల్లో క్రమశిక్షణ, బాధ్యత, అంకితభావంతో పనిచేయాలి" అని సూచించారు.

"గతాన్ని పక్కన పెట్టి.. కొత్త జీవితానికి శ్రీకారం చుట్టండి"

"జీవితంలో ప్రతి ఒక్కరికీ తప్పులు జరిగే అవకాశం ఉంటుంది. అయితే ఆ తప్పును గుర్తించి సరిదిద్దుకుని మంచి మార్పు దిశగా అడుగు వేయడమే నిజమైన విజయం. గతాన్ని పక్కన పెట్టి.. ఈ రోజు నుంచే కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలి. మంచి భర్తగా, మంచి తండ్రిగా, మంచి కుటుంబ సభ్యుడిగా, బాధ్యతాయుతమైన పోలీసు ఉద్యోగిగా ముందుకు సాగాలి" అని ఎస్పీ స్ఫూర్తినిచ్చారు.

కుటుంబంలో ప్రశాంతమైన వాతావరణం ఉంటేనే విధుల్లోనూ మరింత ఏకాగ్రతతో, సమర్థవంతంగా సేవలందించగలుగుతారని తెలిపారు. సిబ్బంది సంక్షేమం కేవలం ఉద్యోగ విధులకు పరిమితం కాదని.. వారి ఆరోగ్యం, కుటుంబ సంతోషం, మానసిక ప్రశాంతత, భవిష్యత్తు కూడా పోలీసు శాఖకు ముఖ్యమని పేర్కొన్నారు. "మీ మంచి భవిష్యత్తుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని భరోసా కల్పించారు.

**ఎస్పీ చొరవపై కానిస్టేబుళ్ల కృతజ్ఞతలు**

తమ కుటుంబ సమస్యను అర్థం చేసుకుని చికిత్స అందించడంతో పాటు వ్యక్తిగతంగా కౌన్సెలింగ్ ఇచ్చిన ఎస్పీ సునితారెడ్డికి కానిస్టేబుళ్లు కిరణ్, నరసింహ కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై మద్యపానానికి పూర్తిగా దూరంగా ఉంటామని, చికిత్స ద్వారా వచ్చిన మార్పును కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. భార్యా పిల్లలు, కుటుంబ సభ్యులతో ప్రేమగా, ఆప్యాయంగా జీవిస్తూ.. తోటి ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలిగి విధుల్లో క్రమశిక్షణ పాటిస్తామని తెలిపారు.




# పోలీసు ఉద్యోగాలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ

- **ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు**
- **పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ అవకాశం**

**వనపర్తి, సెప్టెంబర్ 10 (ప్రజా క్షేత్రం) :**



తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్వ రామిరెడ్డి తెలిపారు. గురువారం వనపర్తి లో వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్‌ల్యాండ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**17 వరకు దరఖాస్తుల స్వీకరణ**

అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 17వ తేదీ రాత్రి 9 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫౌండేషన్‌కు సంబంధించిన వాట్సాప్ ఛానల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వేదికల్లో అందుబాటులో ఉన్న సంకేత చిత్రాన్ని స్కాన్ చేసి లేదా లింక్ ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు.

**13 కేంద్రాల్లో అర్హత పరీక్ష**

అభ్యర్థుల ఎంపిక కోసం తెలంగాణవ్యాప్తంగా సుమారు 13 పరీక్షా కేంద్రాల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెరిట్ ఆధారంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

**భోజనం, వసతితో శిక్షణ**

ఎంపికైన వారికి శంషాబాద్‌లోని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ప్రాంగణంలో ఉచిత భోజనం, వసతితో కూడిన రెసిడెన్షియల్ శిక్షణ అందించడంతో పాటు దుస్తులు కూడా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఎంపిక ఫలితాలను సెప్టెంబరు 22న ప్రకటించి, ఎంపికైన అభ్యర్థులు సెప్టెంబరు 25న శంషాబాద్ ప్రాంగణంలో హాజరు కావాల్సి ఉంటుందని వెల్లడించారు. పోలీసు నియామక ప్రక్రియలోని ప్రధాన పరీక్ష వరకు శిక్షణ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

# తెలంగాణ NSUI రాష్ట్ర కార్యదర్శిగా మెనంగిరి రవితేజ

**ప్రజాక్షేత్రం,మేడ్చల్**



తెలంగాణ రాష్ట్ర NSUI నూతన రాష్ట్ర, జిల్లా కమిటీలను సెప్టెంబర్ 9న ప్రకటించారు. ఈ నూతన కమిటీల్లో మేడ్చల్ జిల్లా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 299వ డివిజన్ గౌడవెల్లికి చెందిన యువ నాయకుడు మెనంగిరి రవితేజను తెలంగాణ NSUI రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన NSUI జాతీయ అధ్యక్షుడు వినోద్ జాకర్, తెలంగాణ NSUI రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ స్వామిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని రవితేజ తెలిపారు. విద్యార్థుల హక్కులు, విద్యా రంగ సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం తదితర అంశాలపై విద్యార్థుల తరఫున నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు.

తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ NSUI బలోపేతానికి కృషి చేస్తానని రవితేజ తెలిపారు. తన నియామకంపై గౌడవెల్లి ప్రాంతానికి చెందిన యువత, కాంగ్రెస్ నాయకులు, NSUI కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ రవితేజకు అభినందనలు తెలిపారు.

# ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో ఆలయాల అభివృద్ధి

- **ఆలయాల అభివృద్ధే లక్ష్యం: నూతన కమిటీ**
- **భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం**

**పెద్దేముల్, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం):**

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవతో ఆలయాలను అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని మంబాపూర్ శ్రీ హనుమాన్ ఆలయ నూతన కమిటీ చైర్మన్ వరప్రసాద్ గౌడ్, శ్రీ గోపాల కృష్ణ ఆలయ నూతన కమిటీ చైర్మన్ ముద్దిని రాములు తెలిపారు.

పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలోని శ్రీ హనుమాన్, శ్రీ గోపాలకృష్ణ ఆలయాల నూతన కమిటీలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీ హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్‌గా వరప్రసాద్ గౌడ్, శ్రీ గోపాలకృష్ణ ఆలయ కమిటీ చైర్మన్‌గా ముద్దిని రాములు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా ఆర్. నర్సింహులు, వడ్ల రాములు, విజయ్‌కుమార్, అనిత, రాజవర్ధన్‌రెడ్డి, సి. నారాయణరెడ్డి, తలారి రాములు, ఎంగూరి లక్ష్మిలు ఎన్నికయ్యారు.

అనంతరం దేవాదాయ శాఖ ఈవో ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్లు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఆలయ కమిటీల బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పనతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపరుస్తామని చెప్పారు. గ్రామస్తులు, కమిటీ సభ్యుల సహకారంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.



కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాయిని నారాయణరెడ్డి, గ్రామ వార్డు సభ్యుడు నర్సింహులు, పూజారి ప్రశాంత్, ఎండోమెంట్ శాఖ సిబ్బంది శాంతు, గ్రామస్తులు తాడి అంజయ్య, చాపల వెంకటయ్య, సంగెం చంద్రప్ప, హర్షవర్ధన్‌రెడ్డి, టిల్లు, కుమ్మరి నర్సింహులు, బంటారం భీమ్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఐక్యతనా..?..రాజకీయ చతురతనా..?

- **సోమశేఖర రావు కు చైర్మన్ పదవి ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మాణం చేసిన రైతులు**
- **ఎమ్మెల్యే పోచారంను కలిసిన ఐదు గ్రామాల రైతులు..?**
- **ఇటీవల ఎమ్మెల్యేను కలిసిన మరికొందరు ఆశావహులు..?**
- **ఎత్తొండ సొసైటీ చైర్మన్ ఎన్నిక పై నెలకొన్న ఉత్కంఠ..!**

**కోటగిరి,సెప్టెంబర్ 10(ప్రజాక్షేత్రం):**

రైతులు సభ్యులుగా ఉండే సహకార సంఘాల చైర్మన్‌ల ఎన్నిక ఈసారి నామినేటెడ్ విధానంలో నిర్వహిస్తారన్న వార్తల మేరకు సహకార సంఘాల చైర్మన్ ల ఎన్నిక పై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి ఎన్నికలకు వెళ్లకుండా నేరుగా నామినేటెడ్ విధానంలో సొసైటీ డైరెక్టర్లు, అధ్యక్షులను ఎన్నుకునే ప్రపోజల్ ను ప్రభుత్వం పరిశీలిస్తున్న తరుణంలో ఆశావహుల నుండి తీవ్ర పోటీ ఎదురవుతుంది. కోటగిరి పోతంగల్ మండలాల్లో నాలుగు సొసైటీలు ఉండగా సొసైటీ ఎన్నికల్లో రాజకీయ ప్రమేయం జరగడంతో ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాల దృష్ట్యా రెండు సొసైటీలలో భారీ అవకతవకలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. సహకార చట్టాల ప్రకారం ఆయా సొసైటీల్లో సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో ఎంక్వయిరీలు జరిగిన దాఖలాలు ఉన్నాయి. ముఖ్యంగా ఎత్తొండ సొసైటీలో భారీ అవకతవకలు జరిగాయని రైతులు ఆరోపిస్తూ పలు కార్యక్రమాలు చేపట్టడంతో అధికారులు పూర్తి ఎంక్వయిరీ చేసి సొసైటీ చైర్మన్, సెక్రెటరీ సహా డైరెక్టర్లందరికీ ఒక్కొక్కరికి దాదాపు 90 లక్షల పైచిలుకు రికవరీ వేసినట్లు గతంలో వార్తలు షికార్లు కొట్టాయి . అంతేకాకుండా పాలకవర్గంలోని సభ్యులందరి స్థిరాస్తులు బ్యాంకు ఖాతాలను సైతం అధికారులు సీజ్ చేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ తరుణంలో సొసైటీ చైర్మన్ పదవులను నామినేటెడ్ కోటాలో నియమిస్తున్నట్లు వార్తలు వస్తున్నందున ఎత్తొండ సొసైటీ పరిధిలోని ఐదు గ్రామాల రైతులు సొసైటీ ఆవరణలో మీటింగ్ ఏర్పాటు చేసుకొని గతంలో సొసైటీ చైర్మన్ గా పనిచేసిన సోమశేఖర రావును తమ సొసైటీ చైర్మన్ గా నియమించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇంతటితో ఆగకుండా రైతులందరూ భారీ సంఖ్యలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని సైతం కలిసి తమ అభిప్రాయాన్ని తెలిపినట్లు సమాచారం. గతంలో చిన్న సొసైటీగా ఉన్న ఎత్తొండ సహకార సంఘం దాదాపు వంద కోట్ల టర్నోవర్ కు తీసుకువచ్చిన, సొసైటీని దినదిన అభివృద్ధి చేసి సొసైటీకి రాష్ట్రంలోనే మంచి పేరు తీసుకువచ్చిన సోమశేఖర రావును తమ సొసైటీ చైర్మన్ గా నియమించాలని ముక్తకంఠంతో రైతులు ఎమ్మెల్యే పోచారం కు వార్తలు వినిపిస్తున్నాయి. గతసారి సొసైటీ చైర్మన్ కు జరిగిన ఎన్నికల్లో సోమశేఖర రావును కాదని వేరే వారిని సొసైటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులుగా నియమిస్తే పాలకవర్గం అసమర్థతతో సొసైటీని పూర్తిగా దివాలా తీసేలా చేశారని రైతులు మండిపడ్డట్లు తెలుస్తుంది. సోమశేఖర రావు పీరియడ్లో సొసైటీ దినదినాభివృద్ధి చెందిందని ఆ తర్వాత ఏర్పడ్డ పాలకవర్గం సొసైటీని అస్తవ్యస్తం చేసిందని రైతులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. చివరికి రైతుల వద్ద కొన్న ధాన్యానికి డబ్బులు చెల్లించలేని స్థితిలోకి సొసైటీ రావడం తో రైతులకు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందని , గతంలో 38 మంది సిబ్బంది పని చేసే సొసైటీలో ప్రస్తుతం కేవలం ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారని మిగతా సిబ్బంది అంతా రోడ్డున పడ్డారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా ఎత్తొండా సొసైటీ చైర్మన్ గా కొత్త సోమశేఖర రావును నియమించాలని రైతులు తమ అభిప్రాయాలను ఎమ్మెల్యేకు తెలుపటమే కాకుండా తమ సొసైటీ భవిష్యత్తును కాపాడాలని కోరినట్లు సమాచారం. ఇంతవరకు బాగానే ఉన్నా రైతులు కోరిన కొత్త సోమశేఖర రావు కు ఎమ్మెల్యే పోచారం కు సఖ్యత లేకపోవడం వారిద్దరి మధ్య గతంలో పలు అంతర్గత విభేదాలు ఉన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతో ఎత్తొండా సొసైటీ చైర్మన్ గా రైతులు సిఫారసు చేసిన కొత్త సోమశేఖర రావు ఎన్నిక పై సందేహాలు తలెత్తుతున్నాయి. గతంలో సొసైటీ చైర్మన్ గా పనిచేసిన కొత్త సోమశేఖర రావు పై సైతం అధికారులు సహకార చట్టం ప్రకారం ఎంక్వయిరీ నిర్వహించగా ఆయన ఆ ఎంక్వయిరీపై స్టే తెచ్చుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం సోమశేఖర రావు ఎన్నికపై ఎంతలా ప్రభావం చూపిస్తుందో వేచి చూడాలి.





**ఎమ్మెల్యే ను కలిసిన మరికొందరు ఆశావాహులు..?**


సొసైటీ పరిధిలోని ఐదు గ్రామాల రైతులు జరిపిన సమావేశం వివరాలు బహిర్గతం అవడంతో మరికొందరు ఆశావాహులు ఎమ్మెల్యే పోచారం వద్దకు పరుగులు పెట్టినట్లు తెలుస్తుంది. అందులో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ఓ పార్టీ నేత తండ్రి సైతం ఉన్నట్లు సమాచారం. ఓ పార్టీ నేత తండ్రి తో పాటు మరో వ్యక్తి సైతం ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానికంగా చర్చలు నడుస్తున్నాయి. ఎమ్మెల్యే పోచారంకు గత 30 ఏళ్లుగా అత్యంత సన్నితంగా ఉన్న ఓ పార్టీ నేత తండ్రికి సొసైటీ చైర్మన్ బాధ్యతలు దక్కే అవకాశాలు ఉన్నట్లు స్థానికంగా వార్తలు షికార్లు కొడుతున్నాయి.ఓ నియోజకవర్గ స్థాయి నాయకుడి తండ్రిని ఎత్తొండ సొసైటీ చైర్మన్ గా నియమించడం వెనుక రాజకీయ చతురతుతో కూడిన వ్యూహం ఉందని స్థానికంగా చర్చలు నడుస్తున్నాయి. ఈ వ్యవహారం పై పోచారం వర్గంలోని కొందరు నాయకులు పెదవి విరిస్తున్నట్లు తెలుస్తుంది. ఆయనకు చైర్మన్ పదవి ఇస్తే స్థానికంగా ఉన్న ఓ వర్గం నాయకులు ఎమ్మెల్యే పోచారం కు దూరం అవుతారనే ఊహాగానాలు సైతం మొదలయ్యాయి. పోచారం వర్గంలోని కొందరు నాయకులు రైతులు సైతం సొసైటీ అభివృద్ధి చేసే వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని చెబుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే సొసైటీ పూర్తిగా దివాలా తీసిందని గతంలో సొసైటీలో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని సమర్థవంతమైన, పూర్తి అవగాహన ఉన్న వ్యక్తులకు చైర్మన్ పదవి ఇస్తే సొసైటీని మళ్లీ దాడిలో పెడతారని పోచారం వర్గం నాయకులు కొందరు ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ఎత్తొండ సొసైటీ చైర్మన్ ఎన్నికలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ నామినేటెడ్ పద్ధతిలో సొసైటీ పాలకవర్గాలను నియమిస్తే ఎత్తొండ సొసైటీ చైర్మన్ ఎన్నిక నియోజకవర్గ నాయకులకు తలనొప్పిగా మారనుంది. మరి కొద్ది రోజుల్లో చైర్మన్ ఎన్నిక పై క్లారిటీ రానున్న నేపథ్యంలో రైతులంతా ఏకమై ముక్తకంఠంతో ప్రస్తావించిన సోమశేఖర రావుకు చైర్మన్ పదవి దక్కుతుందా...? లేదా ఎలాగైనా పదవి దక్కించుకోవాలనే ఉద్దేశంతో రాజకీయంగా పావులు కదుపుతున్న వేరే వ్యక్తులకు సొసైటీ చైర్మన్ పదవి దక్కుతుందా అనే ఉత్కంఠ ప్రస్తుతం నెలకొంది. రైతుల ఐక్యతనా...? లేక రాజకీయ చతురతనా...? ఏది నెగ్గుతుంది గతంలో జరిగినవన్నీ పోచారం దృష్టిలో పెట్టుకోకుండా రైతులు సూచించిన సోమశేఖర రావు చైర్మన్ అవుతారా లేదా రాజకీయ చతురతతో మరెవరైనా ఎన్నికవుతారో తెలియాలంటే సొసైటీ చైర్మన్ ఎన్నిక అధికారికంగా జరిగేంత వరకు ఆగాల్సిందే.

# నిజాం దొరలను ఎదిరించిన వీర వనిత చాకలి ఐలమ్మ

- **మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్**

**జవహర్ నగర్, సెప్టెంబర్ 10, (ప్రజాక్షేత్రం):**

భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం నిజాం దొరలను ఎదిరించి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ నగర్ దొబి ఘాట్ లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నిజాం దొరలను ఎదిరించి పోరాడి చరిత్రలో చిరస్థాయిగా ఆమె అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్లా వినయ్, గజ్వేల్ శంకర్, పొలాస సాయి రఫీక్, డి ఎస్ ఎస్ వెంకటేష్ మంద ఆనంద్ ,రాజు యాదవ్, ఎరుకల వెంకటయ్య స్వామి,కరుణాకర్ ముక్క నర్సిములు తదితరులు పాలుగోన్నారు






# ఎంబీబీఎస్ సీటుతో సాయి వికాస్ విద్యార్థినికి ఘన సన్మానం

- **రాయిగడ్డ హైమావతిని అభినందించిన పాఠశాల యాజమాన్యం**
- **ఒకటో వార్డుకు గర్వకారణం: కౌన్సిలర్ చుక్క జయశ్రీ రాజు**

**వనపర్తి, సెప్టెంబర్ 10( ప్రజా క్షేత్రం) :**

నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించిన సాయి వికాస్ టాలెంట్ స్కూల్ పూర్వ విద్యార్థిని రాయిగడ్డకు చెందిన హైమావతిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్, కరస్పాండెంట్ వెంకట్‌రాములు, ఉపాధ్యాయ బృందం హైమావతిని అభినందించి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఒకటో వార్డు కౌన్సిలర్ చుక్క జయశ్రీ రాజు మాట్లాడుతూ.. ఒకటో వార్డుకు చెందిన హైమావతి ఎంబీబీఎస్ సీటు సాధించడం వార్డుకే గర్వకారణమన్నారు. కష్టపడి చదివి వైద్య విద్యలో సీటు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి వనపర్తి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ హైమావతికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ.. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా తనలాగే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, జ్యోతి, అంజన, పూర్ణిమతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు .

# ఆగిన నిర్మాణం..మళ్లీ పరుగులు!

- **అనుమతి ఉందా? ఆమోదిత ప్లాన్ ఎక్కడ?**
- **సెట్‌బ్యాక్ సంగతేంటి? తనిఖీలు జరిగాయా?**
- **బ్రేక్ నుంచి బిల్డింగ్ దాకా.. మధ్యలో కథేంటి?**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం)**

జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఓ నిర్మాణ వ్యవహారం ఇప్పుడు అధికారుల పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఒకప్పుడు నిర్మాణ పనులను నిలిపివేసిన అధికారులు.. ప్రస్తుతం అదే ప్రాంతంలో పనులు వేగంగా సాగుతున్నా పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. అప్పట్లో అభ్యంతరం ఏమిటి? ఇప్పుడు అభ్యంతరం ఎందుకు లేదు? మధ్యలో ఏం జరిగింది? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

జీడిమెట్ల ఐలా పరిధిలోని ప్లాట్ నంబర్ D179/1, ఫేజ్ 3లో గత జనవరిలో నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు సమాచారం. పనులు మొదలైన కొద్దిరోజులకే సంబంధిత అధికారులు అక్కడికి చేరుకుని నిర్మాణాన్ని నిలిపివేసినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో అప్పట్లో నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ప్లాన్, నిబంధనలపై సందేహాలు వ్యక్తమయ్యాయి.

అయితే కొంతకాలం విరామం తర్వాత సీన్ మారిపోయింది. గత నెల రోజులుగా అదే స్థలంలో పనులు మళ్లీ వేగం పుంజుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం స్టీల్ +2 నిర్మాణం దిశగా పనులు సాగుతున్నప్పటికీ.. గతంలో పనులు ఎందుకు ఆపారు? తిరిగి పనులు ప్రారంభించేందుకు ఏ అనుమతులు లభించాయి? అన్న అంశాలపై మాత్రం స్పష్టత కనిపించడం లేదు.

**అప్పుడు తప్పు..ఇప్పుడు ఒప్పా?**

జనవరిలో అధికారులు నిర్మాణాన్ని నిలిపివేసినట్లయితే.. ఆ సమయంలో గుర్తించిన లోపాలేమిటన్నది కీలకంగా మారింది. నిర్మాణదారుడు నిబంధనలను సరిచేశారా? కొత్తగా అనుమతులు పొందారా? ప్లాన్‌లో మార్పులు చేశారా? లేక ఎలాంటి మార్పులు లేకుండానే పనులు తిరిగి ప్రారంభమయ్యాయా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

**సెట్‌బ్యాక్‌పై స్పష్టత ఏది?**

పారిశ్రామిక ప్రాంతాల్లో నిర్మాణాల విషయంలో సెట్ బ్యాక్, భద్రతా ప్రమాణాలు, వాహనాల రాకపోకలకు అవసరమైన స్థలం వంటి అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో సదరు నిర్మాణంలో నిబంధనలకు అనుగుణంగా సెట్ బ్యాక్ ఉందా? నిర్మాణం స్థల హద్దులకు ఎంత దూరంలో ఉంది? ఆమోదిత ప్లాన్‌కు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయా? అన్నది అధికారులు పరిశీలించాల్సిన అంశంగా మారింది.

**రికార్డులు ఏమంటున్నాయి?**

నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ఆమోదిత ప్లాన్, గతంలో పనులు నిలిపివేసిన చర్యల వివరాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న అనుమతులు.. ఇవన్నీ రికార్డుల్లో ఉంటాయి. మరి ఆ రికార్డులు పరిశీలించి అధికారులు వాస్తవ పరిస్థితిని వెల్లడించాల్సిన అవసరం ఉంది. అనుమతులు ఉంటే నిర్మాణదారుడికి ఎలాంటి ఇబ్బంది లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదే.



**అధికారుల నిఘా ఎక్కడ?**

నిర్మాణ పనులు నెల రోజులుగా కొనసాగుతున్నాయనే స్థానికుల వాదన నేపథ్యంలో.. సంబంధిత విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారా? నిర్మాణం ఆమోదిత ప్లాన్‌కు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించారా? అన్నదీ ప్రశ్నగా మారింది. గతంలో చర్యలు తీసుకున్న అదే నిర్మాణంపై ప్రస్తుతం పర్యవేక్షణ ఎందుకు కనిపించడం లేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభావం ఎవరిది?**


నిర్మాణం తిరిగి ప్రారంభమైన తీరుపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల అనుమతులతోనే పనులు కొనసాగుతున్నాయా? లేక పర్యవేక్షణ లోపంతో పనులు సాగుతున్నాయా? అనే చర్చ జరుగుతోంది. నిర్మాణం వెనుక ప్రభావశీలుల ప్రమేయం ఉందన్న మాటలు కూడా వినిపిస్తున్నప్పటికీ.. దీనిపై ఎలాంటి ఆధారాలు వెలుగులోకి రాలేదు. కాబట్టి అధికారిక విచారణతోనే వాస్తవాలు తేలాల్సి ఉంది.

**ఐలా అధికారులు స్పందించాలి**

జనవరిలో నిర్మాణాన్ని నిలిపివేసిన కారణం ఏమిటి? ఆ సమయంలో ఏ నిబంధనలను అధికారులు గుర్తించారు? ప్రస్తుతం నిర్మాణానికి అనుమతి ఉందా? ఆమోదిత ప్లాన్ ఏంటి? సెట్‌బ్యాక్ నిబంధనలు పాటిస్తున్నారా? మధ్యలో కొత్త అనుమతులు జారీ అయ్యాయా? వంటి అంశాలపై ఐలా అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ఒకసారి ఆపిన నిర్మాణం..**
**ఇప్పుడు అదే వేగంతో ఎలా సాగుతోంది?**

ఈ ప్రశ్నకు అధికారిక సమాధానం రావాల్సిందే. అనుమతులు ఉంటే వివరాలు వెల్లడించాలి.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి. గతంలో తీసుకున్న నిర్ణయం, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అధికారులు స్పష్టం చేస్తేనే ఈ వ్యవహారంపై నెలకొన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.



## వనపర్తి ఆలయ స్వర్ణోత్సవాలకు చిన్న జీయర్ స్వామి

- **శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి 50 ఏళ్లు..**
- **మార్చి 10, 11, 12 తేదీల్లో వేడుకలు**
- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ధర్మకర్త రఘునాథాచార్యుల ఆహ్వానం**
- **సానుకూలంగా స్పందించిన చిన్న జీయర్ స్వామి..**
- **కుటుంబ సమేతంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే**
- **ఐదు దశాబ్దాల ఆధ్యాత్మిక ప్రస్థానానికి గుర్తుగా ఘనంగా స్వర్ణోత్సవాలు**

**వనపర్తి, సెప్టెంబర్ 10(ప్రజా క్షేత్రం) :**

వనపర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పూర్తయి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహోత్సవాలకు శ్రీ చిన్న జీయర్ స్వామి హాజరుకానున్నారు.

వచ్చే ఏడాది మార్చి 10, 11, 12 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఆధ్యాత్మిక వేడుకలకు విచ్చేయాలని ఆలయ ధర్మకర్త రఘునాథాచార్యులు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కలిసి చిన్న జీయర్ స్వామిని ఆహ్వానించారు.

ఆహ్వానాన్ని స్వీకరించిన చిన్న జీయర్ స్వామి సానుకూలంగా స్పందించారు. మార్చి 10, 11, 12 తేదీల్లో వనపర్తికి విచ్చేసి స్వర్ణోత్సవ మహోత్సవాల్లో పాల్గొంటానని హామీ ఇచ్చారు. చిన్న జీయర్ స్వామి రాకకు అంగీకరించడంతో ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**ఐదు దశాబ్దాల ఆధ్యాత్మిక ప్రస్థానం**

వనపర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఐదు దశాబ్దాల ఆధ్యాత్మిక ప్రస్థానం పూర్తవుతున్న నేపథ్యంలో స్వర్ణోత్సవాలను భక్తి శ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**కుటుంబ సమేతంగా ఆహ్వానం**

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తన సతీమణి శారదారెడ్డి, కుమారుడు నవనీత్‌రెడ్డితో కలిసి చిన్న జీయర్ స్వామిని కలిసి స్వర్ణోత్సవాలకు ఆహ్వానించారు. ఆలయ ధర్మకర్త రఘునాథాచార్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వర్ణోత్సవాలకు చిన్న జీయర్ స్వామి హాజరుకావడం వేడుకలకు మరింత విశిష్టతను తీసుకురానుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఎస్ఎల్ఎన్ రమేష్, తిరుమల మహేష్, వికాస తరంగిణి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

- **పెద్దతూప్రలో రజక సామాజిక వర్గం ఆధ్వర్యంలో కార్యక్రమం**

**శంషాబాద్ సెప్టెంబర్10(ప్రజా క్షేత్రం):**

శంషాబాద్ మండలం పెద్దతూప్ర గ్రామంలో రజక సామాజిక వర్గం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

కార్యక్రమంలో శంషాబాద్ మండలం మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్, సర్పంచ్ అంకం సుమలత రాజు యాదవ్, ఉప సర్పంచ్ దిద్యాల శేఖర్, వార్డు సభ్యులు దిద్యాల నరేష్ కుమార్, నల్లొల్ల అశోక్, బోద్దం శివ యాదవ్, ప్యాక్స్ డైరెక్టర్ దిద్యాల గౌతమ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు జయం రాజు పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు డి. చెన్నకేశవ్, బి. విజయ్, ఎన్. కృష్ణ, ఎన్. శ్రీచరణ్, టి. దాస్, ఎన్. మహేష్‌తో పాటు రజక సామాజిక వర్గం సభ్యులు, సీనియర్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించారు.చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పలువురు పేర్కొన్నారు.




## భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ: ఎలిగండ్లలో ఘనంగా 41వ వర్ధంతి

**నారాయణపేట పట్టణం సెప్టెంబర్10( ప్రజాక్షేత్రం):**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, పీడిత ప్రజల ఆత్మగౌరవ ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని నారాయణపేట జిల్లా మరికల్ మండలం ఎలిగండ్ల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, యువకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. "తెలంగాణ తల్లి రా.. చాకలి ఐలమ్మ రా!" అంటూ చేసిన నినాదాలు గ్రామ వీధుల్లో ప్రతిధ్వనించి, ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయి.

చాకలి ఐలమ్మ పోరాట విశిష్టత

దొరల గడీలపై తిరుగుబాటు కేక: నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ రాజ్యమేలుతున్న రోజుల్లో విసునూరు రామచంద్రా రెడ్డి లాంటి క్రూరమైన దేశ్‌ముఖ్‌కు ఎదురొడ్డి నిలిచిన ధీరవనిత. తాను కష్టపడి పండించిన పంటను గుండాలు దోచుకెళ్లకుండా ఒంటి చేత్తో అడ్డుకుని అహంకారాన్ని మట్టికరిపించింది.

సాయుధ పోరాటానికి ఊపిరి: ఆమె భూమి రక్షణ కోసం మొదలైన ఉద్యమమే యావత్ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ప్రధాన నిప్పురవ్వగా మారింది. 'నా భూమి.. నా పంట.. దొర ఎవడు లాక్కోవడానికిఅంటూ ఆమె వేసిన ప్రశ్న తెలంగాణ పల్లెపల్లెనా పోరాట నినాదమైంది.

మహిళా శక్తికి నిదర్శనం: పురుషాధిక్యత, గడీల అణచివేత ఎక్కువగా ఉన్న ఆ కాలంలోనే మహిళలకు నాయకత్వ లక్షణాలు, ధైర్యం మెండుగా ఉంటాయని ప్రపంచానికి చాటిచెప్పిన ఆదర్శమూర్తి.

తెలంగాణ అస్తిత్వానికి చుక్కాని: స్వయంపాలన, ఆత్మగౌరవం కోసం సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి కూడా ఐలమ్మ తెగువ, పోరాట పటిమ గొప్ప నైతిక బలాన్నిచ్చాయి.

వెట్టిచాకిరీ బంధనాలను తెంచి, పీడిత వర్గాల హక్కుల కోసం తుపాకీ పట్టిన చాకలి ఐలమ్మ పోరాట మార్గం నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తి దాయకం. ఆమె ఆశయాలను గుండెల్లో నిలుపుకుని, సమాజంలో అన్యాయాలను ప్రశ్నించడమే ఆమెకు మనం అర్పించే నిజమైన నివాళి.

ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు చాకలి చిన్న బాలు నరేష్ గౌడ్ గారు గారు మరియు కొండప్ప గారు మరియు తిరుపతయ్య గారు మధుగారు చంద్రయుడు గారు మరియు నరేష్ గౌడ్ గారు మరియు నారాయణ రెడ్డి గారు చంద్రశేఖర్ రెడ్డి గారు అనిల్ కుమార్ గారు తదితరులు పాల్గొన్నారు.



## పీఆర్టీయూటీఎస్‌కు కొత్త సారథ్యం

- **తాండూరు మండల శాఖకు నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**
- **అధ్యక్షుడిగా జొన్నల వినోద్.. ప్రధాన కార్యదర్శిగా పట్లోళ్ల పురుషోత్తం రెడ్డి**

**తాండూరు, సెప్టెంబర్ 10(ప్రజాక్షేత్రం)**

పీఆర్టీయూటీఎస్ తాండూరు మండల శాఖకు నూతన సారథ్యం ఏర్పడింది. మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. రెండవసారి అధ్యక్షుడిగా జొన్నల వినోద్, ప్రధాన కార్యదర్శిగా పట్లోళ్ల పురుషోత్తం రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నూతన కార్యవర్గం పనిచేయాలని నాయకులు ఆకాంక్షించారు.నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి నీరజ బాల్‌రెడ్డి, డీఎస్పీ నర్సింగ్ యాదవ్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్రాం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, రాష్ట్ర సంపాదక వర్గ సభ్యులు బాకారం జైపాల్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ రామ్ నర్సింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్, వీరేశం, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి దోమ మండల అధ్యక్షులు కేశవ్, పరిగి మండల కార్యదర్శి మనోహర్, యాలాల మండల అధ్యక్షులు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పరమేష్, పెద్దేముల్ మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గోబ్రియా, జిల్లా అసోసియేట్ జగదీశ్వర్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్, జట్టూరి శ్రీనివాస్, అనిల్, శ్రీశైలం, ప్రసాద్, హుస్సేన్, యాదయ్య, దస్తప్ప తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జొన్నల వినోద్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల పురుషోత్తం రెడ్డిలకు నాయకులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేయడంతో పాటు పీఆర్టీయూటీఎస్‌ను మండలంలో మరింత బలోపేతం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు, పీఆర్టీయూటీఎస్ సీనియర్ నాయకులు నాగప్ప, నర్సిరెడ్డి, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా స్ఫూర్తికి చేయూత

- **అనంతగిరిపల్లి ZPHSలో 105 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు**
- **రూ.42 వేల విలువైన డ్రెస్‌లు సొంత ఖర్చుతో అందజేత**

**వికారాబాద్ బ్యూరో అక్టోబర్ 10 (ప్రజాక్షేత్రం)**

వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతగిరిపల్లి ZPHS ఉన్నత పాఠశాలలో విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న 105 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేశారు. ఒక్కో డ్రెస్ విలువ సుమారు రూ.400 కాగా, మొత్తం రూ.42 వేల విలువైన డ్రెస్‌లను వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, TJMU గౌరవ అధ్యక్షులు అర్థ సుధాకర్ రెడ్డి తన సొంత ఖర్చులతో అందజేశారు.

ఈ సందర్భంగా అర్థ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు, వికారాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు విద్య, క్రీడా రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



**క్రీడలతో ఆరోగ్యం.. క్రమశిక్షణతో భవిష్యత్తు**

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

**పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలరాజు, సోషల్ మీడియా ప్రతినిధులు కురువ శీను, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

**నిర్మల్ జిల్లా, ప్రతినిధి 10 (సెప్టెంబర్ (ప్రజా క్షేత్రం):**

చాకలి ఐలమ్మ చూపిన పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని దేగాం సర్పంచ్ సీరం సుష్మారెడ్డి, ఉపసర్పంచ్ భాలేఖర్ శివాజీ, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. గురువారం దేగాం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఎన్ని ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురైనా వెనకడుగు వేయకుండా పోరాడిన ఆమె జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయడమే ఐలమ్మకు నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## వలిగొండలో చాకలి ఐలమ్మ వర్ధంతి

**వలిగొండ, సెప్టెంబర్ 10(ప్రజా క్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో బీసీ సంఘం అధ్యక్షులు సాయిని యాదగిరి ఆధ్వర్యంలో సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య నాయకులు మాజీ ఉపసర్పంచ్ పబ్బు సురేందర్ మారగోనిశ్రీనివాస్ గౌడ్ ఎలిమినేటి సత్యనారాయణ బొడిగె సుదర్శన్ మైసొల్ల శంకర్ మైసొల్ల లక్ష్మీనరసు నరసింహ కాశీం యాదగిరి రామ నర్సు సాయి తదితరులు పాల్గొన్నారు.



# కొత్తపల్లి సొసైటీ చైర్మన్ బరిలో పుట్టా శ్రీధర్..?

- పుట్టా శ్రీధర్ కు మండల నాయకుల నుండి లైన్ క్లియర్...?
- మరికొందరు ఆశావహులు ఉన్నప్పటికీ పుట్టా శ్రీధర్ వైపే అధిష్ఠానం మొగ్గు...?
- రైతులు, సంఘ సభ్యుల మద్దతు సైతం పుట్టా శ్రీధర్ కే..?






**కోటగిరి సెప్టెంబర్ 10(ప్రజా క్షేత్రం):**

ప్రాథమిక సహకార సంఘాల నూతన కార్యవర్గాల ఎన్నిక నామినేటెడ్ పద్ధతిలో నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నందున ఆయా సొసైటీ పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకుంది. ఎన్నాళ్లుగానో సొసైటీ డైరెక్టర్లు, చైర్మన్ అవ్వాలని ఆశగా ఉన్న నాయకులందరూ పదవుల కోసం లోలోపల పావులు కదుపుతున్నారు. కొందరు నాయకులు స్థానిక సంఘ సభ్యులతో, రైతులతో మంతనాలు జరుపుతుంటే మరికొందరు నియోజకవర్గ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఇటీవల కొన్ని సొసైటీల లో జరుగుతున్న అవకతవకల దృష్ట్యా ఆయా సొసైటీల రైతులు మాత్రం తమ సొసైటీని అభివృద్ధి చేసే నాయకుడినే ఈసారి చైర్మన్ గా నియమించాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తుంది. కొన్ని సొసైటీలో రైతులు సమావేశమై అభివృద్ధి చేసే నాయకుల పేర్లను సైతం చెబుతూ ఏకగ్రీవంగా తీర్మానాలు చేస్తున్నారు. సొసైటీని అభివృద్ధి చేసే నాయకులకు మాత్రమే నియోజకవర్గ నాయకులు సైతం పదవులు ఇవ్వాలని రైతులు సంఘ సభ్యులు బాహాటంగానే చెబుతున్నారు. అనుభవం, రాజకీయ పరిజ్ఞానం, లేని కొత్తవారికి అవకాశం కల్పిస్తే సొసైటీలు అస్తవ్యస్తమయ్యే అవకాశం ఉందని రైతులు చెప్పకనే చెబుతున్నారు. రైతుల విషయం అటుంచితే ఈసారి సొసైటీ చైర్మన్ల ఎన్నిక నామినేటెడ్ విధానంలో ఉండడంతో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు యువ నాయకుడు పోచారం భాస్కర్ రెడ్డి వద్దకు ఆశావాహులు పరుగులు పెడుతున్నట్లు తెలుస్తుంది. రైతుల మద్దతు ఉన్నప్పటికీ నియోజకవర్గ నాయకుల మద్దతు ఉంటేనే నామినేటెడ్ పదవి దక్కుతుందని ఆ దిశగా ఆశావహులు పావులు కదుపుతున్నారు. మండలంలోని కొత్తపల్లి సొసైటీలో సైతం ఈసారి జరిగే చైర్మన్ సహా పాలకవర్గం ఎన్నిక పై ఆసక్తి నెలకొంది. సొసైటీ పరిధిలో చాలామంది ఆశావహులు ఉన్నప్పటికీ మండల నాయకులు,అధిష్ఠానం మాత్రం యువ నాయకుడి వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

**కొత్తపల్లి చైర్మన్ బరిలో పుట్టా శ్రీధర్..?**

కొత్తపల్లి సొసైటీ చైర్మన్ బరిలో యువ నాయకుడు బస్వాపూర్ గ్రామ సర్పంచ్ పుట్టా శ్రీధర్ ఉన్నట్లు స్థానికంగా వార్తలు వినిపిస్తున్నాయి. మొదట్లో కొత్తపల్లి సొసైటీ చైర్మన్ గా మండలానికి చెందిన ఓ సీనియర్ నాయకుడి పేరు ప్రచారంలో ఉండగా ప్రస్తుతం అనూహ్యంగా బస్వాపూర్ గ్రామ సర్పంచ్ పుట్టా శ్రీధర్ పేరు తెరపైకి వచ్చింది. కొత్తపల్లి సొసైటీ పరిధిలో సొసైటీని సమర్థవంతంగా నిర్వహించే నాయకత్వ లక్షణాలు ఉన్న ఒకరిద్దరు వ్యక్తుల్లో ఈయన ఉండటం మండలంలో జరుగుతున్న రాజకీయ కార్యకలాపాల్లో ఆయన చురుకుగా పాల్గొనటమే కాకుండా కొత్తపల్లి సొసైటీ పరిధిలోని ఆయా గ్రామాల్లో జరిగే అన్ని కార్యక్రమాలలో పుట్టా శ్రీధర్ కీలకంగా వ్యవహరించడం అంతేగాకుండా ఆయనకు ఒకటి రెండుసార్లు చైర్మన్ పదవి చేపట్టే అవకాశం వచ్చినప్పటికీ అప్పటి పరిస్థితుల దృష్ట్యా వదులుకోవటంతో ప్రస్తుత పరిస్థితులు ఆయనకు కలిసి వచ్చేలా కనిపిస్తున్నాయి. సొసైటీ పరిధిలోని ఆయా గ్రామాల మెజారిటీ రైతులు, ముఖ్య నాయకులు పుట్టా శ్రీధర్ కు అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తుంది. రైతులతోపాటు మండలంలోని కీలక నేతలు సైతం పుట్టా శ్రీధర్ కే మద్దతు తెలుపుతుండగా ఆయనకు లైన్ క్లియర్ అయినట్లు చర్చలు నడుస్తున్నాయి. గతంలో సొసైటీ పరిస్థితి ఎలా ఉన్నా ప్రస్తుతం సొసైటీ చైర్మన్ గా కొనసాగుతున్న డాక్టర్. సునీల్ కుమార్ తనకు ఎన్ని రాజకీయ ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసి విపత్కర పరిస్థితుల్లో ధీటుగా నిలబడి రూ.5 లక్షల అప్పుల్లో ఉన్న సొసైటీని ప్రస్తుతం మూడు కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న సొసైటీగా అభివృద్ధి చేసినట్లు రైతులు చర్చించుకుంటున్నారు. సొసైటీ లో ఉన్న రైస్ మిల్ రెండు టన్నుల కెపాసిటీతో ఉండగా ప్రస్తుతం చైర్మన్ డాక్టర్.సునీల్ కుమార్ రైస్ మిల్ కెపాసిటీని నాలుగు టన్నులకు పెంచారు. దీంతో సొసైటీ ఆదాయం మరింత పెరిగింది. ఇంతే కాకుండా సొసైటీ పరిధిలోని రైతులకు సరిపడినంత యూరియా, ఎరువులు అందించడంలో చైర్మన్ కీలక పాత్ర పోషించారు. ఇలాంటి పరిస్థితుల్లో సొసైటీకి ఎన్నుకోబడే నూతన చైర్మన్ ప్రస్తుత చైర్మన్ కంటే దీటుగా పనిచేసి సొసైటీని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే సొసైటీ పరిధిలోని నాయకులు రైతులు మండల ముఖ్య నాయకులు యుక్త వయసులోనే రాజకీయాల్లోకి వచ్చి అనతి కాలంలోనే మంచి పేరు సంపాదించి సొసైటీని సమర్థవంతంగా నిర్వహించగల సత్తా ఉన్న నాయకుడిగా, ఇటు రైతులను అటు అధికారులను సమన్వయం చేస్తూ రైతుల సమస్యలను ఎల్లవేళలా పరిష్కరించగలిగే రాజకీయ అనుభవం ఉన్న బస్వాపూర్ గ్రామ సర్పంచ్ పుట్ట శ్రీధర్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు చివరిదాకా కొనసాగితే పుట్టా శ్రీధర్ కొత్తపల్లి సొసైటీ చైర్మన్ గా నియమించబడటం లాంఛనమే కానుంది. ఒకవేళ పరిస్థితులు తారుమారై అనుకోని సంఘటనలు జరిగి కొత్త వ్యక్తుల పేర్లు తెరపైకి వస్తే కొత్తపల్లి సొసైటీ చైర్మన్ ఎన్నిక మరింత ఆసక్తికరంగా మారే అవకాశం లేకపోలేదు ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం కొత్తపల్లి సొసైటీ చైర్మన్ ఎన్నిక నామినేటెడ్ పద్ధతిలో నిర్వహిస్తే బస్వాపూర్ సర్పంచ్ పుట్టా శ్రీధర్ పేరు దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తుంది.

# అంకితభావానికి అభినందనం... 17 మంది గురువులకు ఉత్తమ పురస్కారం

- విద్యార్థుల ఉన్నతికి, పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేసిన వారికి గుర్తింపు
- అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్నిస్తాయి
- పెద్దేముల్ మండల విద్యాధికారి పి.నర్సింగ్ రావు



**పెద్దేముల్, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం)**

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ, వారిని విద్యాపరంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతో పాటు పాఠశాలల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపు లభించింది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశేష పాత్ర పోషించిన పెద్దేముల్ మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 17 మంది ఉపాధ్యాయులను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు పెద్దేముల్ మండల విద్యాధికారి పి.నర్సింగ్ రావు తెలిపారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి పి.నర్సింగ్ రావు మాట్లాడుతూ..

ఉపాధ్యాయ వృత్తి కేవలం బోధనకు మాత్రమే పరిమితం కాదని, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు.ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ,సామర్థ్యం ఉంటుందని ,దానిని గుర్తించి సరైన మార్గంలో నడిపించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారిలో సృజనాత్మకత,క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములవుతూ,విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించిన ఉపాధ్యాయుల సేవలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. బోధనలో ప్రతిభ, విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు.

**మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 17 మంది ఎంపిక**

మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో ఎస్.మంజుల,తెలుగు ఉపాధ్యాయురాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తట్టేపల్లి,
పీ.లింగమూర్తి - గణిత ఉపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందూరు, సి.జయమ్మ -తెలుగు ఉపాధ్యాయురాలు ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మాధ్యమం, ఇందూరు,అనిత -హిందీ ఉపాధ్యాయురాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, పెద్దేముల్,ఎం. వెంకట కృష్ణారెడ్డి - జీవశాస్త్ర ఉపాధ్యాయుడు,ఆదర్శ పాఠశాల అండ్ కళాశాల, గొట్లపల్లి; కె.అన్నపూర్ణ - ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,పెద్దేముల్, సీ. శైలజ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఇందూరు,జె.శృతి - సహాయక ఉపాధ్యాయురాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పెద్దేముల్,కె.స్నేహలత,సహాయక ఉపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,బండపల్లి; సయ్యద్ మహబూబ్ పటేల్ - ఉపాధ్యాయుడు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,తట్టేపల్లి,కావలి రవీందర్, ఉపాధ్యాయుడు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, గోపాల్పూర్; ఈ.బాల్‌రాజ్ - ఉపాధ్యాయుడు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, హన్మాపూర్;
జె. సౌజన్య -ఉపాధ్యాయురాలు, ప్రభుత్వ డీఎన్‌టీ పాఠశాల, కందనెల్లి తండా,ఎన్. అవంతి, ఉపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,హన్మాపూర్, సీహెచ్.అశ్విని,ఉపాధ్యాయురాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఇందూరు,సీహెచ్.సుజాత, సహాయక ఉపాధ్యాయురాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,గిర్మాపూర్, ఎస్.అనూష,సహాయక ఉపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,తింసాన్ పల్లిలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉన్నారని అన్నారు.

**ఉత్తమ గురువులకు ఘనంగా సన్మానం**

ఎంపికైన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం తరఫున ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.నేడు( శుక్రవారం ) సెప్టెంబర్ 11న సాయంత్రం 4:30 నిముషాలకు తాండూరులోని తులసి గార్డెన్‌లో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుల సేవలను గుర్తించి గౌరవించడం ద్వారా ఉపాధ్యాయుల్లో మరింత బాధ్యత, ఉత్సాహం పెరుగుతుందని మండల విద్యాధికారి పి.నర్సింగ్ రావు అన్నారు.ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత మంది ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యున్నతికి,పాఠశాలల ప్రగతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఒక మంచి ఉపాధ్యాయుడి కృషి ఒక విద్యార్థి జీవితాన్నే కాదు..సమాజ భవిష్యత్తును సైతం మార్చగలదని ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- సేవా సంకల్ప అభియాన్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలి
- ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లు వెంటనే స్పందించాలి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్



**వనపర్తి, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం ):**

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ఘనంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం, అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వనపర్తిలో గురువారంజిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలోనే కొనసాగిందన్నారు. సర్దార్ వల్లభ భాయ్ పటేల్ నాయకత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజల పోరాటం, ధైర్యం, త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు.

**మూడు ప్రత్యేక సందర్భాల కలయిక**

సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంతో పాటు విశ్వకర్మ జయంతి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం కూడా ఉండటంతో ఈ నెలలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు 'సేవా సంకల్ప అభియాన్' చేపడుతున్నామని, ఇందులో బీజేపీ కార్యకర్తలతో పాటు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.
అభియాన్‌లో భాగంగా పాఠశాలల్లో 'వికసిత భారత్' అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భవిష్యత్ భారత్ ఎలా ఉండాలి, దేశ అభివృద్ధిలో యువత పాత్ర వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు.

**ఎస్ఐఆర్ నోటీసులను నిర్లక్ష్యం చేయొద్దు**

ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్లు వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి నిర్ణీత సమయంలో స్పందించాలని వీరేందర్ గౌడ్ సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని, నోటీసులను పరిశీలించి అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.
సెప్టెంబర్ 17 కార్యక్రమాలతో పాటు సేవా సంకల్ప అభియాన్‌లో రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ సమావేశంలో బీజేపీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బొక్క బాల్రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, సీనియర్ నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుజ్ఞ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, కల్పన, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా..రూ.2.75 లక్షల ఆర్థిక సాయం!

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో అనారోగ్య బాధితుడికి ఎల్ఓసి మంజూరు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం)**

అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న ప్రగతినగర్‌కు చెందిన గొల్ల అశోక్ యాదవ్ కుటుంబానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ అండగా నిలిచారు. వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి (ఎల్ఓసి) ద్వారా రూ.2.75 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.
మంజూరైన ఎల్ఓసి చెక్కును భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి అశోక్ యాదవ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు వైద్య సహాయం అందేలా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సహాయం అందేలా తమ వంతు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దర్శన్ యాదవ్, వికాస్ యాదవ్, సమ్మయ్యతో పాటు అశోక్ యాదవ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వ్యవసాయ విద్యుత్ కోసం రైతుల ధర్నా

- సక్రమంగా సరఫరా కావడం లేదని ఆవేదన..
- అధికారుల హామీతో విరమణ



**వనపర్తి, సెప్టెంబర్ 10 ప్రజాక్షేత్రం ):**

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా అందడం లేదని ఆరోపిస్తూ వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామం పెద్దగూడెం పరిధిలోని రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. కడుకుంట్ల విద్యుత్ ఉపకేంద్రం ఎదుట, కడుకుంట్ల-వనపర్తి ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కనీసం ఆరు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ అందడం లేదని తెలిపారు. తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో బోర్లు, మోటార్లు పనిచేయక సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని కోరారు.
గతంలో విద్యుత్ కొరత ఉన్న సమయంలోనూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా జరిగిందని రైతులు గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ వ్యవసాయానికి సరిపడా సరఫరా ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు.
రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యుత్ డిమాండ్ పెరగడం వల్ల సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు రైతులకు వివరించారు.
అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈ శ్రీనివాసులు రైతులతో మాట్లాడారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో రైతులు ధర్నాను విరమించారు.
కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కేమాణిక్యం, రఘువర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, ధర్మానాయక్, దేగ మహేశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము, లక్ష్మీకాంత్‌రెడ్డి, సర్పంచ్ తిరుపతయ్య, మాజీ సర్పంచ్‌లు హరిత బాలకృష్ణ, కొండయ్య, కృష్ణనాయక్, మనీష్, గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, అశోక్ తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# అండర్14, అండర్17 విభాగాల్లో కోకో పోటీలు

- ఫిట్‌నెస్ ఉంటేనే క్రీడలో రాణింపు!
- క్రీడాకారులతో ముకేశ్ కుమార్ చిట్‌చాట్
- త్రిబుల్ ఒలింపియన్ మాటలతో క్రీడాకారుల్లో ఉత్సాహం
- 1100 మంది క్రీడాకారులతో జోనల్ రెండవ రోజు పోటీలు

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం):**

క్రీడల్లో ప్రతిభ ఒక్కటే సరిపోదని.. దానికి సరైన ఫిట్‌నెస్ తోడైతేనే క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగగలరని త్రిబుల్ ఒలింపియన్, మాజీ భారత హాకీ ఆటగాడు ఎన్. ముకేశ్ కుమార్ అన్నారు. క్రీడాకారుల శారీరక దారుఢ్యంపై పీఈటీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బాచుపల్లిలోని సూర్య గ్లోబల్ స్కూల్లో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కుత్బుల్లాపూర్ జోనల్ స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్‌లో భాగంగా రెండో రోజు కోకో పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్14, అండర్17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 1100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

**ఫిట్‌నెస్ లేకుంటే గాయాల ముప్పు**

ఏ క్రీడను ఎంచుకున్నా ముందుగా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని ముకేశ్ కుమార్ సూచించారు. సరైన శారీరక దారుఢ్యం లేకపోతే ఆటలో రాణించడం కష్టమవుతుందని, గాయాల బారినపడే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతి క్రీడాకారుడికి పీఈటీలు క్రమం తప్పకుండా ఫిట్‌నెస్ శిక్షణ అందించాలని సూచించారు.

**క్రీడాకారులతో ముఖేష్ కుమార్ చిట్ చాట్**

పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ముకేశ్ కుమార్ క్రీడాకారులతో కొద్దిసేపు చిట్‌చాట్ చేశారు. వారి ఆట, శిక్షణ, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. త్రిబుల్ ఒలింపియన్‌తో మాట్లాడే అవకాశం లభించడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది.

**మైదానంలో హోరాహోరీ పోటీలు**

అండర్14, అండర్17 విభాగాల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు మరింత ఉన్నత స్థాయి పోటీలకు అవకాశం లభించనుంది. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ సెక్రటరీ పి. నాగరాజు గౌడ్, పీడీలు వినోద్, విజయ్, రమేష్, సురేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# ఐలమ్మ ఆశయాల సాధనకు ఉద్యమించాలి

- సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి
- చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలి




**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం)**

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు జయప్రదం చేయాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. షాపూర్‌నగర్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలపురం రాజశేఖర్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మతో పాటు వేలాది మంది సాగించిన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, అమరవీరుల ఆశయాల సాధన కోసం ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లింగస్వామి, అంజయ్య, బి.సత్యం, స్వాతి, కరుణాకర్, కే.శీను, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చదువుకు ప్రభుత్వ భరోసా

- ప్రభుత్వ కళాశాల,పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు.. షూస్.. సాక్సులు
- పెద్దేముల్ ఎంఈఓ పి.నర్సింగ్ రావు

**పెద్దేముల్, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం)**

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పెద్దేముల్ మండల విద్యాశాఖ అధికారి పి.నర్సింగ్ రావు అన్నారు.విద్యార్థులకు అవసరమైన బ్యాగులు,షూస్, సాక్సులను ప్రభుత్వం ఉచితంగా అందించేందుకు పెద్దేముల్ మండల విద్యా వనరుల కేంద్రానికి చేరవేసిందని తెలిపారు.ఈ సందర్భంగా పెద్దేముల్ ఎంఈఓ పి.నర్సింగ్ రావు మాట్లాడుతూ....
ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా సామగ్రిని త్వరలో వివిధ కళాశాలలు,పాఠశాల ద్వారా అర్హులైన విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంచేందుకు ప్రభుత్వం ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.అందులో భాగంగా పెద్దేముల్ మండల పరిధిలోని పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం 202 కళాశాల బ్యాగులు,పెద్దేముల్ బీసీ బాలుర వసతి గృహం విద్యార్థుల కోసం 66 స్కూల్ బ్యాగులు, 66 జతల తెల్లని షూస్, 132 జతల సాక్సులు వచ్చాయని తెలిపారు.అలాగే మంబాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థుల కోసం 469 స్కూల్ బ్యాగులు, 400 జతల తెల్లని షూస్, 800 జతల సాక్సులు చేరినట్లు పేర్కొన్నారు.మారేపల్లి కేజీబీవీ విద్యార్థినుల కోసం 360 స్కూల్ బ్యాగులు, 360 జతల తెల్లని షూస్, 720 జతల సాక్సులు,పెద్దేముల్ సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థుల కోసం 491 స్కూల్ బ్యాగులు, 640 జతల తెల్లని షూస్, 1,280 జతల సాక్సులు వచ్చినట్లు ఎంఈఓ వివరించారు.మండల పరిధిలోని చైతన్యనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం 14 స్కూల్ బ్యాగులు కూడా విద్యా వనరుల కేంద్రానికి చేరినట్లు తెలిపారు.





**58 పాఠశాలలకు బ్లాక్ సాక్సులు**

పెద్దేముల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న మొత్తం 58 పాఠశాలల విద్యార్థుల కోసం బ్లాక్ కలర్ సాక్సులు కూడా వచ్చినట్లు ఎంఈఓ పి.నర్సింగ్ రావు తెలిపారు.విద్యార్థులకు చేరాల్సిన సామగ్రిని సంబంధిత పాఠశాలలు,కళాశాలలకు వీలైనంత త్వరగా తరలించి,అర్హులైన విద్యార్థులకు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**తల్లిదండ్రులకు ఆర్థిక ఊరట**

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బ్యాగులు, షూస్, సాక్సులతో విద్యార్థులకు పాఠశాలకు అవసరమైన సామగ్రి అందుబాటులోకి వస్తుందని ఎంఈఓ అన్నారు.ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల తల్లిదండ్రులకు ఇది కొంత ఆర్థిక ఊరటనిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



## చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

- జిల్లా హెల్పింగ్ సొసైటీ అధ్యక్షులు సింగారం రమేష్

**భువనగిరి, సెప్టెంబర్ 10(ప్రజా క్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాపురం గ్రామం లో రజక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా హెల్పింగ్ సోసైటీ అధ్యక్షులు సింగారం రమేష్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. దొరల అరాచకాలకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని రజక సంఘం నాయకులు అన్నారు. కార్యక్రమంలోసర్పంచ్:కాళీ పద్మ వెంకన్న ఉపసర్పంచ్: మల్లె పాక నరేష్ సెక్రెటరీ: విజయ*వార్డ్ సభ్యులు:*:పాచిల్ల శ్రీను చిలుకూరి మోహన్ మలిపెద్ది సుమతి మాటూరు శేఖర్ అంగన్వాడి టీచరు వాణి శ్రీ ఆశ వర్కర్ మొగిలి పాక లావణ్య బొడిగె కవిత గోపాలమిత్ర పాలడుగు కిష్టయ్య గ్రామ ప్రజలు బెంజరి శ్రీశైలం పాలడుగు సోమయ్య మొగిలి పాక వెంకటేష్ గ్రామ పంచాయతీ సిబ్బంది,, రజక సంఘం సభ్యులు వెంకటయ్య రవి సోమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణగట్టి సుభాష్ మాతృమూర్తి మృతి బాధాకరం కెఎల్ఆర్

- కుటుంబ సభ్యులను పరామర్శించిన మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

**మహేశ్వరం సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం):**

స్వర్ణగట్టి సుభాష్ మాతృమూర్తి కమలమ్మ మృతి పట్ల మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కమలమ్మ మృతి విషయం తెలుసుకున్న వెంటనే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మహేశ్వరం లోని వారి నివాసానికి చేరుకుని, కుటుంబ సభ్యులను నేరుగా కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా స్వర్ణగట్టి సుభాష్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చరు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబంలో పెద్దను కోల్పోవడం ఎంతో బాధాకరమైన విషయమని, తల్లి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని పేర్కొన్నారు. కమలమ్మ కుటుంబానికి అందించిన ప్రేమ, ఆప్యాయతలు, కుటుంబ సభ్యులకు చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన సంతాపం వ్యక్తం చేశారు. కమలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.
కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పరామర్శకు వచ్చిన సందర్భంగా మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కమలమ్మ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా కే ఎల్ ఆర్ మాట్లాడుతూ... కమలమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## విద్యార్థుల సమస్యలపై పోరాటానికి మరింత బలం

- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లా ఆనంద్

**శంషాబాద్, సెప్టెంబరు 10 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఎన్ఎస్‌యూఐ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యువ నాయకుడు జిల్లా ఆనంద్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది.
ఆనంద్ నియామకంపై ఎన్ఎస్‌యూఐ శ్రేణులు, విద్యార్థి వర్గాల్లో హర్షం వ్యక్తమైంది. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడికి రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించడం పట్ల పలువురు విద్యార్థి నాయకులు అభినందనలు తెలిపారు.

**విద్యార్థుల కోసం మరింత బాధ్యతగా పనిచేస్తా**

తన నియామకంపై జిల్లా ఆనంద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌స్వామి, అక్బర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎల్లప్పుడూ వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి తనకు హోదా కాదని, విద్యార్థుల కోసం మరింత బాధ్యతగా పనిచేసే అవకాశం అని ఆనంద్ పేర్కొన్నారు. ఫీజుల పెంపు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ వసతులు, ఉద్యోగ నోటిఫికేషన్లు తదితర సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎస్‌యూఐని బలోపేతం చేసి, ప్రతి కళాశాలలో విద్యార్థుల సమస్యలపై పోరాడే బలమైన నాయకత్వాన్ని నిర్మిస్తామని తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటించి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై కుల దూషణకు
# కఠిన చర్యలు తీసుకోవాలి

- దళితులను అవమానించే వారిని శిక్షించాలి.. పి. మల్లేశం డిమాండ్

**వికారాబాద్ బ్యూరో సెప్టెంబర్ 10 ( ప్రజాక్షేత్రం )**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కులం పేరుతో దూషించడం యావత్ తెలంగాణ దళిత ప్రజానీకాన్ని అవమానించడమేనని వికారాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పి. మల్లేశం అన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



**ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి పిలుపు**

కుల దూషణ ఘటనకు నిరసనగా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించి, దళితుల పట్ల జరిగిన అవమానానికి నిరసన తెలియజేస్తామని మల్లేశం పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.
దళిత వ్యతిరేక వైఖరిని ప్రజలు గమనించాలి దళితుల పట్ల జరిగిన అవమానాన్ని ఖండించకుండా కొందరు బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని మల్లేశం విమర్శించారు. కేసీఆర్ నివాసాన్ని దేవాలయంగా పేర్కొంటూ, అక్కడికి వెళ్లిన దళితులను రాక్షసులుగా అభివర్ణించడం సిగ్గుచేటని ఆయన అన్నారు.

**వికారాబాద్‌లోనూ బీఆర్ఎస్‌ను నమ్మొద్దు**

దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు, చర్యలను ప్రజలు గమనించాలని మల్లేశం కోరారు. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో దళితులు బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ నాయకుల వైఖరిని పరిశీలించి భవిష్యత్తులో తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## గ్యాస్ సిలిండర్ లీకేజీతో వృద్ధుడి మృతి

- చికిత్స పొందుతూ 78 ఏళ్ల యాదయ్య మృత్యువాత

**కుషాయిగూడ, సెప్టెంబరు 10(ప్రజా క్షేత్రం):**

గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది.
పోలీసుల వివరాల ప్రకారం.. కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కొక్కుల యాదయ్య (78) జూలై 21న ఉదయం 6 గంటల సమయంలో భోజనం తయారు చేసుకునేందుకు చిన్న గ్యాస్ సిలిండర్ స్టౌవ్‌ను వెలిగించాడు. గ్యాస్ లీకేజీ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి యాదయ్యకు అంటుకున్నాయి. స్థానికులు వెంటనే అతడిని ఈసీఐఎల్ లోని జీనియా ఆసుపత్రికి తరలించారు.



అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆగస్టు 16న గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు యాదయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు కొక్కుల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నర్కూడ ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి చర్యలు

- సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్
- జీపీ నిధులతో ఇందిరమ్మ కాలనీలో బోరు

**శంషాబాద్, సెప్టెంబర్ 10(ప్రజా క్షేత్రం):**

ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని నర్కూడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ అన్నారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు గురువారం గ్రామ పంచాయతీ నిధుల ( జీపి)తో కాలనీలో మంచినీటి బోరు వేయించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ నీరటి మహేష్ ముదిరాజ్ కలిసి ఆయన మాట్లాడారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు 60 చదరపు గజాల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంచినీరు , విద్యుత్ సౌకర్యం కల్పించాలని కాలనీ ప్రజలు తమకు విజ్ఞప్తి చేశారని తెలిపారు. దీంతో ప్రజల అవసరాల మేరకు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగానే కాలనీలో నీటి సమస్య పరిష్కారం కోసం బోర్ వేయించడం జరిగిందని తెలిపారు. గతంలో కాలనీకి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై సదరు వ్యక్తులతో మాట్లాడి 30 ఫీట్ల రోడ్డు విడిపించడం జరిగిందన్నారు. రోడ్డు ఏర్పాటు కారణంగా శంషాబాద్ ప్రాంతానికి సులభమైన రాకపోకలకు అవకాశం ఏర్పడిందన్నారు. త్వరలోనే కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారం చేసి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామన్నారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ కాలనీలో బోరు వేయించినందుకు సంతోషం వ్యక్తం చేస్తు సర్పంచ్ కు పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. రంజిత్ కుమార్ , వార్డు సభ్యులు కనకమామిడి విష్ణు ముదిరాజ్, పర్వతం వినోద్ కుమార్, చౌట రాజు, బూరుకుంట నాగరాజు, పర్వతం వెంకటయ్య నాయకులు తొంట అశోక్, గూడెపు వెంకట్ లక్ష్మణ్ రావు, బి. దేవేందర్ , పర్వతం జగన్, కర్ధాల్ శ్రీనివాస్, గుండాల విష్ణు, కుమ్మరి మహేష్ బాబు, కుమ్మరి భాస్కర్, వీఆర్ఏ నీరటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అఖిల గోల్డ్ మెడల్ సాధించడం ఆనందంగా ఉంది

**హైదరాబాద్, సెప్టెంబరు 10(ప్రజాక్షేత్రం):**

నిజాం కళాశాలలో వ్యవసాయ ఆర్థికశాస్త్రంలో ఎం.ఏ.పట్టాలో అఖిల గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందని ఆ విభాగం అధ్యాపకుడు డా. కాటేపాగ యుగంధర్ అన్నారు. విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడం అధ్యాపకుడిగా తనకు గర్వకారణమని పేర్కొన్నారు. డా. యుగంధర్ 2008 నుంచి బోధనా రంగంలో కొనసాగుతున్నారు. 2022 నుంచి నిజాం కళాశాలలో వ్యవసాయ ఆర్థికశాస్త్రాన్ని బోధిస్తున్నట్లు తెలిపారు. తన బోధనా ప్రస్థానంలో విద్యార్థులు వివిధ స్థాయిల్లో ప్రతిభ కనబరిచినా.. నిజాం కళాశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించడం ప్రత్యేకమైన అనుభూతినిచ్చిందన్నారు.
అఖిల ఇంటర్మీడియట్‌లో 99/100 మార్కులు సాధించడంతోపాటు డిగ్రీలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఆమె కృషి, పట్టుదల ఫలితంగానే గోల్డ్ మెడల్ సాధించగలిగిందన్నారు. అఖిల, ఆమె కుటుంబ సభ్యులు ప్రొఫెసర్ కాశీం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌ను కలవడం కూడా సంతోషంగా ఉందని చెప్పారు.



విద్యార్థి సాధించిన విజయాన్ని తన ఎన్నో ఏళ్ల బోధనా సేవకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని డా. యుగంధర్ పేర్కొన్నారు. అఖిలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

**వ్యవసాయ రంగానికి దోహదం**

వ్యవసాయ ఆర్థికశాస్త్రంలో విద్యార్థులు సాధిస్తున్న ప్రతిభ భవిష్యత్తులో తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడుతుందని డా. యుగంధర్ అన్నారు. అఖిల సాధించిన గోల్డ్ మెడల్ రాష్ట్ర వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కడానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

## బసవన్నల అలంకరణ.. ట్రాక్టర్ల ర్యాలీతో



- దేగాంలో పోలాల పండగ సందడి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం):**

భైంసా మండలం దేగాం గ్రామంలో పోలాల అమావాస్య వేడుకలను రైతులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. పోలాల అమావాస్యను పురస్కరించుకుని గ్రామంలోని రైతులు తమ బసవన్నలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం అలంకరించిన బసవన్నలతో పాటు ట్రాక్టర్లను సిద్ధం చేసి గ్రామంలో ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు.
పోలాల అమావాస్య సందర్భంగా గ్రామంలోని వీధులు బసవన్నల అలంకరణలు, ట్రాక్టర్లతో సందడిగా మారాయి. రైతులు సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి తమ వ్యవసాయ పనుల్లో తోడుగా నిలిచే ఎద్దుల పట్ల కృతజ్ఞతను చాటుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, రైతులకు మంచి దిగుబడులు రావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు.
ట్రాక్టర్ ర్యాలీ సందర్భంగా రైతులు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగడంతో స్థానికులు ఆసక్తిగా వీక్షించారు. సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే పోలాల అమావాస్య వేడుకలను ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా గ్రామస్థులు ఐక్యంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది.
ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, రైతులు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బసవన్నల పూజలు, ట్రాక్టర్ ర్యాలీతో గ్రామంలో సందడి నెలకొనగా, చిన్నారులు, మహిళలు, వృద్ధులు సైతం వేడుకలను ఆసక్తిగా తిలకించారు. రైతుల జీవన విధానంలో వ్యవసాయానికి, పశుసంపదకు ఉన్న ప్రాధాన్యతను చాటిచెప్పేలా పోలాల అమావాస్య వేడుకలు ఘనంగా సాగాయి.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్స్ గడువు పొడిగింపు.

**చేవెళ్ల సెప్టెంబర్ 10(ప్రజాక్షేత్రం):**

డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు - 2026 27 చేవెళ్ల మరియు పరిసర ప్రాంతాల విద్యార్థులకు డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డిగ్రీ మొదటి సంవత్సరం బిఎ, బికాం, బిఎస్సి కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు మరియు సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ రెండవ మరియు మూడవ సంవత్సరం విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజును చెల్లించవచ్చని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తు గడువు చివరి తేది సెప్టెంబర్ 30 ఈ విషయాన్ని కళాశాల కోఆర్డినేటర్ కె. సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 9908640914 ఈ నంబర్ సంప్రదించాలని కోరారు.




## మహిళల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం

**గండిపేట సెప్టెంబర్ 10(ప్రజాక్షేత్రం)**



మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాదిగ మహిళా సమైక్య నాయకుల ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం రంగారెడ్డి జిల్లా గండిపేట మండల కేంద్రము ఆరమైసమ్మ ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా చేవెళ్లపల్లి విజయ, మంగ మాదిగ, మహిళా కోర్ కమిటీ సభ్యురాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదిగ మహిళల సమస్యలు, సామాజిక హక్కులు, మహిళల సాధికారత తదితర అంశాలపై చర్చించారు. జిల్లా స్థాయిలో మాదిగ మహిళా సమైక్యాన్ని మరింత బలోపేతం చేసి, మహిళలను ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా కమిటీ ప్రతినిధులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- **జాకోర ఎత్తిపోతల పథకం సాగునీటి పంపులు ప్రారంభించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి**

**వర్ని, సెప్టెంబరు 10 (ప్రజాక్షేత్రం):**

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం జాకోర గ్రామంలో ఎత్తిపోతల పథకం సాగునీటి పంపులను వారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతన్న సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రైతులకు సాగునీటి కొరత లేకుండా చేసి పంటల సాగును ప్రోత్సహించేందుకు పలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

జాకోర ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందుబాటులోకి రావడంతో స్థానిక రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. నీటి వసతి పెరగడంతో రైతులు రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుందని, తద్వారా వ్యవసాయ ఉత్పత్తి పెరగడంతో పాటు రైతుల ఆదాయం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. రైతుల పొలాల్లో పంటలు సమృద్ధిగా పండితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు.

వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. సాగునీరు, వ్యవసాయ మౌలిక వసతులు, రైతులకు అవసరమైన సహాయ సహకారాల విషయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో మాజీ జిల్లా డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి, బారి, బుజ్జి సాయిబాబా, రంజియా నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దాడులు ఆపాలి.. రైస్ మిల్లర్లకు సహకరించాలి..!

- **డిసెంబర్ 31లోగా పెండింగ్ సీఎంఆర్ ఇచ్చేందుకు రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారు.**
- **విజిలెన్స్ దాడులు కేసుల వల్ల రైస్ మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.**
- **రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ పటేల్.**

**కోటగిరి,సెప్టెంబర్ 10(ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వం రైస్ మిల్లర్లపై చేపడుతున్న విజిలెన్స్ దాడులు ఆపి రైస్ మిల్లర్ల సమస్యలు తెలుసుకుని రైస్ మిల్లర్లకు సహకరించాలని ఇంటిగ్రేటెడ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ పటేల్ కోరారు. కోటగిరి మండల కేంద్రంలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ కార్యాలయంలో గురువారము రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆద్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు... రైస్ మిల్లర్ల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవని రైస్ మిల్లర్లలో కొందరు ప్రభుత్వానికి ఇచ్చే సీఎంఆర్ బకాయి ఉన్న మాట వాస్తవమని 2025 ,26 ఖరీఫ్ సీజన్ కు చెందిన సీఎంఆర్ ప్రభుత్వానికి ఇచ్చేందుకు రైస్ మిల్లర్లకు డిసెంబర్ 31 వరకు సమయం ఉందని పెండింగ్ సీఎంఆర్ డిసెంబర్ 31లోగా ఇచ్చేందుకు రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇంతలో ప్రభుత్వం విజిలెన్స్ దాడులు నిర్వహించి కేసులు చేసి రైస్ మిల్లులు సీజ్ చేయటం వల్ల రైస్ మిల్లర్లకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైస్ మిల్లర్ల కుటుంబాలు రోడ్డు న పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్ల సమస్యలు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రైస్ మిల్లర్లకు సహకరించాలని కోరారు. రైస్ మిల్లర్లందరం శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్నామని ప్రభుత్వ పెద్దలు రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులతో జిల్లా అధ్యక్షులను పిలిచి మాట్లాడి రైస్ మిల్లర్ల సమస్యలు తెలుసుకుని తమపై సానుభూతితో అండగా ఉండాలని కోరారు. మొండి బకాయిలు ఉన్నవారిపై కఠినంగా వ్యవహరించినా పర్లేదు కానీ కొద్దిగా బకాయిలు ఉన్నవారికి ప్రభుత్వం కొంత సమయం ఇవ్వాలని అడిగారు. సీఎంఆర్ బియ్యం లారీలు పంపితే గోదాముల్లో ఖాళీ లేక నెలల తరబడి ఖాళీ అవ్వటంలేదని వెంటనే లోడ్‌లు ఖాళీ అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బియ్యం స్టోరేజ్‌కు స్థలం లేక రైస్ మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైస్ మిల్లర్లు పంపే సీఎంఆర్ నిల్వ చేసేందుకు గోదాములు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్వింటాలు వడ్లకు 67 కిలోల బియ్యం వచ్చే పరిస్థితులు లేవని అవి భర్తీ చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అవకాశం ఇచ్చినా తీరు మార్చుకోని రైస్ మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకున్నా తమకు సమ్మతమేనని కానీ ఎవరో ఒకరు చేసే తప్పులకు అందరూ రైస్ మిల్లర్లను ఆపాదించవద్దని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శంకర్ పటేల్,జనరల్ సెక్రెటరీ నిశాంత్ సేఠ్,వైస్ ప్రెసిడెంట్ సిరాజ్,క్యాషియర్ అన్సార్,జాయింట్ సెక్రెటరీ నిసార్ హైమద్,సభ్యులు జుబేర్ హైమద్,గణేష్ సేఠ్, అన్వర్,అక్రమ్,జమీర్,శ్రీనివాస్ రెడ్డి,శ్రీనివాసరావు,సోహెల్,అతీక్,లయీఖ్ తదితరులు పాల్గొన్నారు.





## జగద్గిరిగుట్ట పోలీసుల వలలో బైక్ దొంగ

- **మూడు చోరీలు..ఒకే దొంగ!**
- **పల్సర్, స్ప్లెండర్, యాక్టివా స్వాధీనం**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం)**

జగద్గిరిగుట్టలో వరుస బైక్ చోరీలకు తెరపడింది. శ్రీనివాసనగర్‌కు చెందిన ముక్కిడి బాలకృష్ణ బైక్ చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల నమోదైన మూడు ద్విచక్ర వాహనాల చోరీ కేసుల దర్యాప్తులో నిందితుడి పాత్రను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.





దర్యాప్తులో భాగంగా నిందితుడి వద్ద నుంచి పల్సర్, స్ప్లెండర్, యాక్టివా.. మొత్తం మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో నమోదైన మూడు కేసులకు సంబంధించి వాహనాల రికవరీ జరిగినట్లు వెల్లడించారు. చోరీ కేసులను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన జగద్గిరిగుట్ట క్రైమ్ టీమ్‌ను కుత్బుల్లాపూర్ డీసీపీ, ఏసీపీ అభినందించారు. వరుస చోరీలపై నిఘా పెట్టి నిందితుడిని గుర్తించడం ద్వారా పోలీసులు కేసులను ఛేదించినట్లు తెలిపారు.

## కేటీఆర్ విమర్శలు అర్ధరహితం ఆధారాలుంటే బయటపెట్టాలి కేఎల్ఆర్

- **ప్రభుత్వంపై బురద జల్లడమే టిఆర్ఎస్ నేతల పనిగా మారింది కేటీఆర్ కు**
- **దమ్ముంటే ఆరోపణలకు ఆధారాలు బయటపెట్టాలి -కేఎల్ఆర్**

**మహేశ్వరం, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కీచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) మాట్లాడుతూ.....

కేటీఆర్ విమర్శలు అర్థరహితం..ఆధారాలుంటే బయటపెట్టాలి ప్రభుత్వంపై బురదజల్లడమే బీఆర్ఎస్ నేతల పనిగా మారింది కేటీఆర్‌కు దమ్ముంటే ఆరోపణలకు ఆధారాలు బయటపెట్టాలి

సీఎం సోదరులపై నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

భూముల వ్యవహారంపై రాజకీయ రాద్ధాంతం కాదు.. వాస్తవాలు చెప్పాలి

బీఆర్ఎస్ అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనను టేక్ డైవర్షన్ పాలిటిక్స్ చేయడానికే

మొత్తం ఎకరాలు 1250.3250 గుంటలకు ...రూ.18,25,32,307 మొత్తాన్ని పరిహారం/ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు

-మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మండిపాటు

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోదరులపై, జెన్నయాగూడ భూముల వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాలు, పెట్టుబడులు, మౌలిక వసతులపై నిర్మాణాత్మకంగా మాట్లాడాల్సిన ప్రతిపక్షం.. వ్యక్తిగత ఆరోపణలు, నిరాధార విమర్శలతో రాజకీయాలను దిగజారుస్తోందని కెఎల్ఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనను టేక్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని దుయ్యబట్టారు. అసెంబ్లీ వద్ద డ్రామాలను కప్పిపుచ్చుకోవడానికే సీఎం సోదరులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.

"కేటీఆర్‌కు నిజంగా ఏదైనా ఆధారం ఉంటే బయటపెట్టాలి. పత్రాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారిక రికార్డులతో ప్రజల ముందు వాస్తవాలను ఉంచాలి. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం రాజకీయ బాధ్యత కాదు" అని కెఎల్ఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని, రైతులు, మహిళలు, యువత, పేదలు, ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు.భూముల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగానే ఉంది జెనయాగూడ భూముల అంశంపై కేటీఆర్ చేస్తున్న ఆరోపణలపై కెఎల్ఆర్ స్పందిస్తూ.. భూముల విషయంలో ఏదైనా అక్రమం జరిగిందని భావిస్తే సంబంధిత పత్రాలను బయటపెట్టి, విచారణ కోరాలని సూచించారు. రాజకీయ ఆరోపణలతో కాకుండా వాస్తవాలు, ఆధారాలతో మాట్లాడాలని హితవు పలికారు. "ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదు... తప్పు జరిగితే విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది, కానీ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతి అంశాన్ని వివాదంగా మార్చడం, వ్యక్తులపై ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదు" అని కెఎల్ఆర్ స్పష్టం చేశారు.అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని ప్రజా సమస్యలు ఇప్పుడు గుర్తొచ్చాయా..?బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన వ్యవహారాలపై ప్రజలు అనేక ప్రశ్నలు అడుగుతున్నారని కెఎల్ఆర్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూములు, ప్రాజెక్టులు, ప్రభుత్వ ఆస్తులు, ఒప్పందాల విషయంలో తీసుకున్న నిర్ణయాలపై కూడా బీఆర్ఎస్ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు."పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పని వారు.. ఇప్పుడు వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై లెక్కలు అడగడం విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన పనితీరుపై ప్రజల ముందే లెక్కలు చెబుతోంది. బీఆర్ఎస్ కూడా తన పదేళ్ల పాలనపై ప్రజలకు లెక్క చెప్పాలి" అని కెఎల్ఆర్ అన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యమా..? తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఫ్యూచర్ సిటీ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కెఎల్ఆర్ తెలిపారు. అభివృద్ధి జరిగితే తెలంగాణకు పెట్టుబడులు వస్తాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను స్వాగతించాల్సిన ప్రతిపక్షం అడ్డంకులు సృష్టించడం దురదృష్టకరమని విమర్శించారు. "ప్రజలు ఇప్పుడు మాటలు కాదు.. పని చూస్తున్నారు. ఎవరు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు..? ఎవరు ఇప్పుడు ఏం చేస్తున్నారు..? అన్నది ప్రజలకు స్పష్టంగా తెలుసు. కేటీఆర్ ఎన్ని ఆరోపణలు చేసినా వాస్తవాలను ప్రజల నుంచి దాచలేరు" అని కెఎల్ఆర్ అన్నారు.వ్యక్తిగత ఆరోపణలు మానుకుని ప్రజా సమస్యలపై మాట్లాడాలి

బీఆర్ఎస్ నేతలు వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలు పక్కనపెట్టి తెలంగాణ ప్రజల అసలు సమస్యలపై మాట్లాడాలని కెఎల్ఆర్ సూచించారు. రైతులు, యువత, మహిళలు, విద్యార్థులు, పేదల సమస్యలపై ప్రభుత్వంతో నిర్మాణాత్మకంగా చర్చించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. "కేటీఆర్‌కు ప్రభుత్వంపై ఆరోపణలు చేయాలనుకుంటే ఆధారాలతో రావాలి. నిరాధార ఆరోపణలకు కాంగ్రెస్ భయపడదు. ప్రజల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మధ్యే ఉంటుంది.. ప్రజల తీర్పును స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది" అని కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

**అసలు కథ ఇదీ మీకు తెలిదా.. ..?**

మహేశ్వరం మండలం రావిర్యాల, శ్రీనగర్, ఇమాంగూడ గ్రామాల్లోని ఫ్యాబ్ సిటీ భూముల వివరాలను మాజీ ఎమ్మెల్యే , మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి వెల్లడించారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం హాయంలో ప్రణాళికలు రూపొందిస్తే ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి టీజీఐఐసీకి అప్పగించారని గుర్తు చేశారు. ప్రభుత్వం భూములు ఇవ్వడంతో అక్కడికి పరిశ్రమలు రాక మొదలైందన్నారు. రావిర్యాల, శ్రీనగర్, ఇమాంగూడ గ్రామాల్లో ఫ్యాబ్ సిటీ కోసం కేటాయించిన భూముల వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామం సర్వే నంబర్లు విస్తీర్ణం భూమి రావిర్యాల 21 , 28,



30 నుంచి 87 ఎకరాలు 810.14 గుంటలు దేవాదాయ భూమి , రావిర్యాల 18 ఎకరాలు 76.08 గుంటలు (సర్వే నం.18లో ఎకరాలు 37.29 గుంటలు) ప్రభుత్వ అసైన్డ్ భూమి , రావిర్యాల 88 ఎకరాలు 38.19 గుంటలు ప్రభుత్వ అసైన్డ్ భూమి, శ్రీనగర్ 111 నుంచి 114 ఎకరాలు 346.22 గుంటలు దేవాదాయ భూమి, శ్రీనగర్ 166 నుంచి 168, 170 నుంచి 189 ఎకరాలు 9.16 గుంటలు పట్టా భూమి, శ్రీనగర్ 192/పి ఎకరాలు 2.33 గుంటలు ప్రభుత్వ అసైన్డ్ భూమి,ఇమాంగూడ 13, 14, 18, 19, 26, 28, 29, 31 ఎకరాలు 5.1950 గుంటలు పట్టా భూములు కాగా, మొత్తం ఎకరాలు 1250.3250 గుంటలను తీసుకున్నట్లు వివరించారు. భూ సేకరణకు సంబంధించిన మహేశ్వరం మండలంలోని రావిర్యాల, శ్రీనగర్, ఇమాంగూడ గ్రామాల్లో మొత్తం 1,250.32½ గుంటల భూమిని పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం భూ సేకరణ చేశారని గుర్తు చేశారు. ఈ భూముల స్వాధీనం ప్రక్రియను చేపట్టి, 2005 నుంచి 2008 మధ్యకాలంలో భూములను టిఎస్ఐడిసి / టిఎస్ఐఐసి కార్పొరేషన్‌కు అప్పగించినట్లు గుర్తు చేశారు. భూములకు సంబంధించి టీఎస్ఐసి సంస్థ రూ.18,25,32,307 మొత్తాన్ని పరిహారం/ఎక్స్‌గ్రేషియా చెల్లింపుల కోసం రెవెన్యూ అధికారుల వద్ద జమ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. సేకరించిన భూముల్లో దేవాదాయ భూములు, పట్టా భూములు, ప్రభుత్వ అసైన్డ్ భూములు ఉన్నాయని వెల్లడించారు. ఈ భూములను టీఎస్ఐఐసి ఆధీనంలోకి తీసుకుని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారిశ్రామిక యూనిట్ల స్థాపన కోసం వివిధ కంపెనీలకు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు.

## ఎడపల్లి ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత చెస్ బోర్డులు

**నిజామాబాద్, సెప్టెంబరు 10 (ప్రజాక్షేత్రం):**

విద్యార్థుల్లో చెస్ క్రీడపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో ఎడపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా చెస్ బోర్డులను పంపిణీ చేశారు. చెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో, కాకతీయ శాండ్‌బాక్స్ ఫౌండేషన్ సహకారంతో ఎడపల్లి జడ్పీహెచ్ఎస్ (తెలుగు మీడియం)లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెస్ సాధనతో విద్యార్థుల్లో ఏకాగ్రత, తార్కిక ఆలోచన, ఓర్పు, క్రమశిక్షణ, నిర్ణయ సామర్థ్యాలు పెంపొందుతాయని తెలిపారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు చెస్ నేర్చుకునే అవకాశం కల్పించడం ద్వారా వారి మేధో వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

చెస్ నెట్‌వర్క్ ప్రతినిధి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలలకు చెస్‌ను చేరువ చేయడం, ప్రతి విద్యార్థికి చెస్ నేర్చుకునే అవకాశం కల్పించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

చెస్ నెట్‌వర్క్ సభ్యుడు, బోధన్ సాయి శ్యామల చెస్ అకాడమీ చెస్ కోచ్, మెంటర్ సాయిబాబా సామల మాట్లాడుతూ చెస్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు మరింత శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భవిష్యత్తులో చెస్ అభివృద్ధికి చేపట్టనున్న ప్రణాళికలను వివరించారు.

ఈ సందర్భంగా మాజీ నిజామాబాద్ ఎంపీ ఆత్మచరణ్‌రెడ్డి, కాకతీయ శాండ్‌బాక్స్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారాన్ని నిర్వాహకులు, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత చెస్ బోర్డులు అందించడం వల్ల విద్యార్థులకు సాధనకు అవకాశం లభించడంతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

'ప్రతి పాఠశాలకు చెస్.. ప్రతి విద్యార్థికి ఒక అవకాశం.. ప్రతి ప్రతిభకు ఒక వేదిక' అనే లక్ష్యంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



## ఆత్మకూరు చెరువు కట్టపై నగర సుందరీకరణ పనులు

**ఆత్మకూర్ ప్రతినిధి10( ప్రజాక్షేత్రం )**

ఆత్మకూరు: మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూరు మున్సిపల్ కేంద్రంలో నగర సుందరీకరణలో భాగంగా శ్రీ శ్రీ స్వయంభు చర్ల పరమేశ్వర స్వామి చెరువు కట్టపై ఉన్న కంపచెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

చెరువు కట్ట పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో కంపచెట్లను తొలగించారు. పట్టణ సుందరీకరణకు అవసరమైన చర్యలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీమతి నాగమణి, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ రహమతుల్లా, సీనియర్ నాయకులు, డీసీసీ కార్యదర్శి తులసి రాజు యాదవ్, పరమేష్, 5వ వార్డు కౌన్సిలర్ దండు శ్రీనివాసులు, 9వ వార్డు కౌన్సిలర్ సద్దాల తులసి, వెంకట్ రాములు, 1వ వార్డు కౌన్సిలర్ కోట్ల తిరుపతి, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు



## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అసత్య ప్రచారం.. పోలీసులకు ఫిర్యాదు

- **సోషల్ మీడియాలో చనిపోయినట్లు పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**మహేశ్వరం, సెప్టెంబరు 10 (ప్రజాక్షేత్రం):**

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మృతి చెందినట్లు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

రజక కుటుంబం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వీర్లపల్లి శంకర్ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై, దొరల పాలనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నందుకు కొందరు ఓర్వలేక సోషల్ మీడియాలో ఆయన మృతి చెందినట్లు వీడియోలు, పోస్టులు ప్రచారం చేస్తున్నారని యాదయ్య ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా దూషించడం, తప్పుడు వార్తలు ప్రచారం చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా.. దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాఖ్యలు, ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో దళితుల పట్ల జరిగినట్లు చెబుతున్న ఘటనలపై కూడా యాదయ్య స్పందించారు. ఈ అంశాలపై బీఆర్ఎస్ స్పందించకపోవడం విచారకరమన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసినట్లు ఫిర్యాదు అందిందని, దీనిపై విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మహేశ్వరం సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపినట్లు యాదయ్య పేర్కొన్నారు.




## బోడ సమ్మయ్య మృతి కుటుంబానికి తీరని లోటు

- **మాజీ జడ్పీటిసి స్వప్న భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే**

**జహీరాబాద్ సెప్టెంబర్ 10 ( ప్రజా క్షేత్రం).**

బోడ సమ్మయ్య మృతి కుటుంబానికి తీరని లోటని, వారి స్వభావం చాలా ఉన్నతమైనదాని, గతంలో కొన్ని సందర్భాల్లో వారితో కలిసినప్పుడు ఎంతో ఆప్యాయంగా పలకరించేవరని, వారి మృతి కుటుంబ సభ్యులకు ఎంతో తీరనిది అని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. బుధవారం రాత్రి బీదర్ జిల్లా కేంద్రంలోనీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వస విడిచిన సంగతి తెలిసిందే. గురువారం నాడు మాజీ న్యాల్కల్ జెడ్పీటీసీ భాస్కర్ తండ్రి బోడ సమ్మయ్య అంత్యక్రియల్లో శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎరుపుల నారోత్తం హాజరై వారి భౌతిక కయాన్ని సందర్శించి పుష్ప గుచ్ఛంతో నివాళులార్పించారు. అనంతరం మాజీ జడ్పిటిసి భాస్కర్ ను పరామర్శించి వారి యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. మండలల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, అధ్యక్షులు వెంకటేశం, అధ్యక్షులు నర్సింలు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, మ్యాతారి ఆనంద్, గుంజెటి సర్పంచ్ దేశెట్టి పాటిల్, మాజీ సర్పంచ్ వెంకట పుర్ రాజశేఖర్, రాజేందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మాజి సర్పంచ్ లు, మాజి ఎంపీటీసీ లు, గ్రామల అధ్యక్షులు, పాల్గొన్నారు..



# బుడ్డగూడెంలో ఆగని ఇసుక రవాణా..!

- **ఎవరి అండదండలతో కొనసాగుతోంది? చర్యలకు అధికారులు ఎందుకు వెనుకడుగు?**

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 10(ప్రజా క్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సోంపల్లి గ్రామపంచాయతీ పరిధి లోని బుడ్డగూడెంలో ఇసుక రవాణా వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. రోజురోజుకూ ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.నిత్యం పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారింది!**

బుడ్డగూడెం నుంచి సోంపల్లి-మొరంపల్లి బంజర వైపు వెళ్లే రహదారిపై ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు అధికం కావడంతో రోడ్డు పరిస్థితి దారుణంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు.ఒకప్పుడు తారురోడ్డుగా ఉన్న మార్గం ప్రస్తుతం ఇసుక లారీలు, ట్రాక్టర్ల రాకపోకలతో మట్టి రోడ్డును తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రహదారి దెబ్బతినడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**ఎవరి అండదండలు ఉన్నాయంటూ ప్రశ్నలు**


బుడ్డగూడెంలో ఇసుక రవాణా ఇంత బహిరంగంగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారమే తరలింపు జరుగుతోందా? అన్న విషయాలను అధికారులు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు.అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇసుక ట్రాక్టర్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎవరి అండదండలతో ఈ వ్యవహారం కొనసాగుతోందో అధికారులు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వంపై విమర్శలు**

ఇసుక రవాణాపై ఫిర్యాదులు, ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత శాఖలు స్పందించకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.రహదారులు దెబ్బతింటున్నా, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి బుడ్డగూడెంలో జరుగుతున్న ఇసుక రవాణాపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలితే సంబంధిత వాహనాలను సీజ్ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇసుక రవాణా విషయంలో అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.







# ప్రజా పోరాటాలకు సమ్మక్క సారక్కలే స్ఫూర్తి.

- **దోపిడి, పీడన, వివక్షత, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమానికి శ్రీకారం.**
- **కుల వివక్షత ఆధునిక భారత దేశంలో అతి పెద్ద సామాజిక రుగ్మత.**
- **పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ.**

**వరంగల్ బ్యూరో సెప్టెంబర్ 10(ప్రజాక్షేత్రం)**






దోపిడీ, పీడన, దౌర్జన్యం, అణచివేత, అహంకారానికి వ్యతిరేకంగా చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి వీర మరణం పొంది వన దేవతలుగా చరిత్రకెక్కిన మా సమ్మక్క సారక్కలే ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తారని, ఎమ్మార్పీఎస్ చేపట్టబోయే భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు ఆ తల్లుల ఆశీస్సులు ఉండాలని మొక్కులు చెల్లించుకున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. మేడారంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జాతీయ కార్యవర్గ సమావేశం జరుగుతున్న సందర్భంగా సమ్మక్క, సారక్క గద్దెలను మంద కృష్ణ మాదిగ దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశంలో కుల వివక్షత తీవ్ర స్థాయిలో పెరిగిందని అన్నారు. నేటి ఆధునిక భారత దేశంలో కుల వివక్షత అతిపెద్ద సామాజిక రుగ్మతగా మారిందని అన్నారు. అందులో భాగంగా దళితులైన మాజీ చీఫ్ జస్టిస్ గావాయి మీద బూట్లు విసిరి దాడి చేయడం, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన స్థలాన్ని శుద్ధి చేయడం, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ మీద ఎమ్మెల్సీ తాత మధు అవమానకర వ్యాఖ్యలు చేయడం కుల వివక్షతకు సాక్షంగా ఉన్నాయని అన్నారు. అందువల్ల దేశంలో కుల వ్యవస్థను రద్దు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కుల నిర్మూలన జరగాలని అన్నారు. కుల వ్యవస్థ వల్ల నష్టపోయిన బ్రాహ్మణేతర కులాలను ఏకం చేసి ఉద్యమం చేస్తామని అన్నారు. అలాగే ఆర్థిక అసమానతలు, మత వివక్షత, లింగ, వర్గ వివక్షతలు రోజు రోజుకు తీవ్రంగా పెరుగుతున్నాయని అన్నారు. పేదరికంలో నేడు కోట్లాది మంది మగ్గిపోతున్నారని అన్నారు. అందువల్ల పేదరిక నిర్మూలన కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని అన్నారు. మత సామరస్యత, లింగ సమానత్వం కోసం భవిష్యత్ పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ పోరాటాలకు సమ్మక్క సారక్కల తల్లుల ఆశీస్సులు కోరుకున్నమని అన్నారు. దేశంలో వామపక్షాలు, విప్లవోద్యమం, సాంఘిక ఉద్యమాలు బలహీన పడడం అత్యంత బాధాకరమని అన్నారు. ఆ ఉద్యమాల ఆకాంక్షలను ఎమ్మార్పీఎస్ భుజాలకెత్తుకుంటుందని అన్నారు. అందుకోసం బలమైన ఉద్యమ నిర్మాణం చేయడానికి గ్రామ మండల కమిటీల నిర్మాణం పూర్తి చేసుకుంటున్నామని అన్నారు. అక్టోబర్ 7 న అమరావతిలో నూతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**కుషాయిగూడ, సెప్టెంబరు 10(ప్రజా క్షేత్రం):**

మౌలాలి హెచ్‌బీ కాలనీలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి (52) మృతదేహం లభ్యమైంది. నీలం రంగు షర్టు, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. సుమారు 5.5 అడుగుల ఎత్తు, సాధారణ ఛాయతో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# క్రిష్ణగిరి పాదాల గుట్ట శ్రీ రాధాక్రిష్ణ ఆలయ క్షేత్రం.

- **కర్త కర్మ క్రియ నరేష్ కుమార్ కు ఐదు వేల విరాళం.**
- **రిటైర్డ్ టీచర్ నర్సింహారెడ్డి ని అభినందించిన సేవా ఫౌండేషన్.**

**శంకర్ పల్లి, సెప్టంబర్ 10(ప్రజాక్షేత్రం):**

సనాతన ఆలయాల అభివృద్ధికి అలుపెరుగని మహా యజ్ఞం చేస్తున్న నరేష్ కుమార్ దేశ సేవ, దైవ సేవకు ముగ్ధుడైన రిటైర్డ్ టీచర్ నర్సింహారెడ్డి శుక్రవారం సాయంత్రం తన వంతు సహాయంగా రూపాయలు ఐదు వేలను శంకర్ పల్లి లోని నరేష్ కుమార్ కు చెందిన పాల షాపులో అంధచేయడం జరిగింది. ఈ సందర్భంగా టీచర్ దండు నర్సింహా రెడ్డి మాట్లాడుతూ నరేష్‌కుమార్ చిన్నప్పటి నుండి సేవా ధృకృథం కల వ్యక్తి అని, ఎన్కతల శనీశ్వరుని గుడికి, మాంధాపురం లోని గుడికి ప్రచారం చేస్తూ, చందిప్ప మరకత శివలింగ నామ కరణ, పునరుద్ధరణ భక్తునిగా కోటి దీపోత్స రాష్ట్ర స్థాయ ఆవార్డును అందుకున్నారని కొనియాడారు. నరేష్ సేవలను చూసి ఇటీవల భాజాపా ఎండోన్మెంట్ సెల్ ధార్మిక సంస్థ కన్వీనర్ అన్నా వజ్జుల సూర్య ప్రాకాశ్ రావు, కో కన్వీనర్ నిరంజన్ దేశాయిలు నరేష్ కుమార్ కు రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ గా పదవిని ఇవ్వడం సంస్థకే గర్వ కారణం అన్నారు. పదేండ్ల కృషితో చందిప్ప మరకత శివాలయాన్ని అభివృద్ధి చేసిన నరేష్ పుణ్యమా అని సుమారు 50 కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని, ఇది కారణ జన్మకే లభిస్తుందని అన్నారు. అనంతరం నరేష్ కుమార్ మాట్లాడుతూ సత్యమే జయతే అన్నట్లు ధర్మం కోసం పని చేస్తే ఇలాంటి అభివృద్ధికి ఎంతో మంది ముందుకు వస్తారని నేను చేస్తున్న సేవలకు నా కుటుంబం, నా మిత్రులు అండగా ఉన్నారని, ఈ కార్యక్రమంలో బుల్కాపూర్ కాళికా మాత గుడి పూజారి రాంచందర్, పాల షాపు యజమాని పండరి నాథ్, స్వర్గీయ వెంకట్ రావు కుమారుడు బాబు, మురళీ క్రిష్ణ, మధు, నోముల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



# మాదిగలకు సీఎం క్షమాపణ చెప్పాలి.

- **డప్పును, మాదిగలను అవమానించారు.**
- **బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.**

**హైదరాబాద్ సెప్టెంబర్ 10(ప్రజాక్షేత్రం):**

సంధ్యారావు అనే వ్యక్తిని సృష్టించింది ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డేనని, డప్పును.. మాదిగలను అవమానించినందుకు మాదిగలకు సీఎం క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మాదిగలు ఎవరి చావును కోరుకోరని, డప్పు..! మనిషి బతకాలని చెప్పే తమ సంస్కృతిలో భాగమని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంధ్యారావు ఎవరో, ఆమెను ఎవరు సృష్టించారో రాష్ట్ర ప్రజలు అన్వేషిస్తున్నారని అన్నారు. సంధ్యారావు పేరుతో మహిళ ఫొటో, పురుషుడి వాయిస్‌తో ఉన్న పోస్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. లక్షలాది సోషల్ మీడియా పోస్టులు ఉండగా.. ముఖ్యమంత్రికి సంధ్యారావు పోస్టే ఎలా దొరికిందని ప్రశ్నించారు. గత 3 రోజులుగా తెలంగాణ అబద్ధాలతో మునిగిపోయిందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సమస్యలు, 22ఏ, పాలిటెక్నిక్, రెవెన్యూ తదితర అంశాలపై మాట్లాడేందుకు అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల వద్ద పురుష పోలీసులను, పురుష ఎమ్మెల్యేల వద్ద మహిళా పోలీసులను పెట్టి వివాదాస్పద పరిస్థితులు సృష్టించారన్నారు. ఓ ఎమ్మెల్సీ ఆవేశంలో మాట్లాడిన మాటలను ఆధారంగా చేసుకుని దళితులను అవమానించారంటూ కేసులు పెట్టారని చెప్పారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కాంగ్రెస్ నాయకులే దళిత దళిత అంటూ అవమానించారని, ఆయన తల్లిని ఎవరూ ఏమీ అనలేదని అన్నారు. సీతక్క పదేపదే ఆ అంశాన్ని ప్రస్తావించి స్పీకర్‌ను బాధించారని విమర్శించారు. తాతా మధు నేరుగా స్పీకర్‌ను తిట్టలేదని పోలీస్ రిపోర్టే చెప్పిందని, కోర్టు కూడా కేసును కొట్టివేసిందన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి సూచనతోనే షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసీఆర్ చావు కోరుతూ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

**డప్పు.. మాదిగల ఆత్మగౌరవం**

మాదిగలు ఎప్పుడూ మనిషి చావును కోరుకోరని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదిమ మానవుడి కాలం నుంచి ప్రమాదాల నుంచి రక్షణకు, సమాచారాన్ని చేరవేయడానికి డప్పు ఉపయోగపడిందన్నారు. పెళ్లిళ్లు, పోచమ్మ పండుగలు, చాటింపులు, చావులు, పోరాటాల్లో డప్పు భాగమైందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలోనూ లక్షలాది డప్పులు పెత్తందార్లకు వ్యతిరేకంగా మోగాయని, డప్పు తిరుగుబాటు బావుటా అని పేర్కొన్నారు. డప్పు తమ సంస్కృతి, ఆయుధం, ఆభరణమని అన్నారు. వేయి డప్పుల ర్యాలీకి వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తూంకుంట నరసా రెడ్డి, బీర్ల ఐలయ్య తదితరులు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. మాదిగలు ఎవరి చావునూ కోరుకోరని, రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని, వాటిని సుమోటోగా తీసుకుని విచారణ జరపాలని కోరారు. మాదిగలు, దళితులు, మహిళలకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన దళిత బంధు, 3 ఎకరాల భూ పంపిణీ, అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం, కళ్యాణ లక్ష్మి, గురుకులాలు, సాంస్కృతిక సారధి వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. 22ఏ పేరుతో ఎస్సీల భూములు లాక్కుంటున్నారని విమర్శించారు. డప్పు కళాకారులకు రూ.3 వేల పెన్షన్ ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజయ్ ఆర్య క్షత్రియ తదితరులు పాల్గొన్నారు




# గణేష్ ఉత్సవాలకు భద్రతా కవచం

- **200 మంది నిర్వాహకులతో బాచుపల్లి పోలీసుల సమన్వయ సమావేశం**
- **డ్రగ్స్, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10 (ప్రజాక్షేత్రం)**

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు బాచుపల్లి పోలీసులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవ నిర్వాహకులు, వివిధ గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులతో గురువారం బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు.సుమారు 200 మంది నిర్వాహకులు, కమిటీ ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ దాలి నాయుడు, సంబంధిత సెక్టార్ ఎస్ఐలు నిర్వాహకులకు గణేష్ ఉత్సవాలు, నిమజ్జన సమయంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. శాంతిభద్రతలు, మత సామరస్యం, జనసమూహాల నియంత్రణతో పాటు ట్రాఫిక్, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్ణయించిన సమయాలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖలకు సహకరించాలని కోరారు.

**మండపాల వద్ద సీసీ కెమెరాలు**

గణేష్ మండపాలు, సున్నితమైన ప్రాంతాల్లో పనిచేసే స్థితిలో ఉన్న సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని పోలీసులు సూచించారు. అవాంఛనీయ ఘటనలను అరికట్టడంతో పాటు నేరాల దర్యాప్తులో సీసీటీవీ కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. పోలీసుల సూచనలకు స్పందించిన నిర్వాహకులు తమ ప్రాంతాల్లో కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా సహకరిస్తామని తెలిపారు.

**సైబర్ మోసాలు..డ్రగ్స్‌పై అప్రమత్తం**

ఉత్సవాల సందర్భంగా ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, నిల్వ, రవాణా, వినియోగం వంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తామని నిర్వాహకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హామీ ఇవ్వడంతో సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసింది.



# దళితుడికి ప్రెస్ క్లబ్ అధ్యక్ష పదవి ఇవ్వడం గర్వకారణం

**కోటగిరి, సెప్టెంబరు 10 (ప్రజాక్షేత్రం):**



ఉమ్మడి మండలాలకు సంబంధించిన విజ్ఞాన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా దళిత సామాజిక వర్గానికి చెందిన గైని గజానంద్‌ను ఎన్నుకోవడం గర్వకారణమని దళిత, బహుజన వర్గాల ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్‌కు గౌరవ అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించడం కూడా అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టుగా కొనసాగుతున్న శ్రీనివాస్ మౌనం, ఓర్పు, సహనం, చిరునవ్వుతో అందరితో కలిసిమెలిసి ఉంటారని, దళిత, బహుజన వర్గాల పట్ల వినయ విధేయతతో వ్యవహరిస్తూ కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు.నూతన అధ్యక్షుడు గైని గజానంద్ దళిత, బహుజన వర్గాల సమస్యలపై స్పందిస్తూ వారి అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తున్నారని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తూ, తనదైన శైలిలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గజానంద్ ఎన్నిక కావడం పట్ల దళిత, బహుజన వర్గాల నాయకులు, జర్నలిస్టులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్‌గా బలరాం శ్రీనివాస్

**సంగారెడ్డి, సెప్టెంబరు 10 (ప్రజాక్షేత్రం):**



కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా బలరాం శ్రీనివాస్‌ను మండల వైస్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ పదవి అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు.

పార్టీకి కట్టుబడి పనిచేస్తూ, కార్యకర్తలందరి సహకారంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు.

తన నియామకానికి సహకరించిన సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, బ్లాక్ ప్రెసిడెంట్ చాట్ల సిద్దన్న, మండల పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్‌కు బలరాం శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు.

# భార్య మృతితో మనస్తాపం.. యువకుడి ఆత్మహత్య

**కాప్రా, సెప్టెంబరు 10(ప్రజా క్షేత్రం):**



భార్య మృతి చెందడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మారుతినగర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన డేవిడ్ (26) ప్రస్తుతం చక్రిపురంలోని మారుతినగర్‌లో తల్లి సుజాతతో కలిసి నివాసముంటున్నాడు. పెయింటర్‌గా పనిచేస్తున్నాడు.

డేవిడ్ ప్రియాంకను ప్రేమ వివాహం చేసుకోగా.. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఏడాది క్రితం భార్య ప్రియాంక మృతి చెందింది. అప్పటి నుంచి డేవిడ్ మనస్తాపంతో ఉన్నట్లు సమాచారం. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డయల్ 100కు సమాచారం అందడంతో పెట్రోల్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో డేవిడ్‌ను కిందకు దించి, అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మహబూబ్‌నగర్ నుంచి బంధువులు వచ్చిన అనంతరం ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394